వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 49 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-


# రైతులకు గుడ్‌న్యూస్ చెప్పిన తెలంగాణ సర్కార్..!



## 9.89 లక్షల మందికి ప్రయోజనం..

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి శుభవార్త చెప్పింది. ఏకంగా 9.89 రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా నిర్ణయం తీసుకుంది. 1970లలో అప్రకటిత భూమి లావాదేవీలను సక్రమం చేయడానికి సాదాబైనామా అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీని వలన రైతులు సాగు చేసుకుంటున్న భూములకు రిజిస్ట్రేషన్ చేసుకునే మార్గం లభించింది. నిజానికి భూమి రిజిస్ట్రేషన్ ప్రతి రైతుకు చాలా ముఖ్యం. భూమికి చట్టబద్ధ రిజిస్ట్రేషన్ లేకపోతే ఆస్తిపై హక్కులు నిరూపించుకోవడం కష్టమవుతుంది. గతంలో భూమి కొనుగోలు, అమ్మకాలు కేవలం కాగితాల ఒప్పందాలు, సంతకాలతోనే జరిగేవి. వీటిని సాదాబైనామాలు అని పిలిచేవారు. వీటి వల్ల రైతులకు బ్యాంకు రుణాలు లభించడం కూడా కష్టమయ్యేది.అయితే 2020 నవంబర్ 10 వరకు ఆన్‌లైన్ ద్వారా సాదాబైనామా దరఖాస్తులను స్వీకరించారు. కానీ ఆర్.ఓ.ఆర్. చట్టంలో ఈ అంశాన్ని చేర్చకపోవడంతో హైకోర్టు స్టే విధించింది. దాదాపు 9.89 లక్షల మంది రైతుల దరఖాస్తులు నిలిచిపోయాయి. ఇటీవల హైకోర్టు ఆ స్టే ఎత్తివేయడంతో, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలనకు మార్గం సుగమమైంది. తాజాగా తెలంగాణ రెవెన్యూ శాఖ సాదాబైనామా క్రమబద్ధీకరణ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని వల్ల సాదాబానామాలకు దరఖాస్తు చేసుకున్న 9.89 లక్షల మందికి లబ్ధిపొందనున్నారు. సుమారు 11 లక్షల ఎకరాల భూములకు 13-బీ ప్రొసీడింగ్స్ జారీ అయ్యే అవకాశం ఉంది. ఈ నిర్ణయం రైతులకు పలు విధాలుగా ఉపయోగపడనుంది. భూమికి సంబంధించిన చట్టబద్ధ పత్రాలు లభించడం వల్ల పట్టాదారు పాస్ పుస్తకాలు పొందుతారు. తద్వారా రైతులు రుణాలు పొందే అవకాశం ఉంటుంది. వారసత్వం, విక్రయం, భూమి రక్షణ వంటి అంశాల్లో ఇకపై సమస్యలు తలెత్తవు. భూమి రికార్డులు పూర్తిగా పారదర్శకంగా మారి, దళారుల జోక్యం తగ్గే అవకాశముంది.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్
నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి





వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 49 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-




బిల్లుల ఆమోదంలో గవర్నర్, రాష్ట్రపతిలకు

## నిర్దిష్ట గడువు

- కేసులో ముగిసిన విచారణ..
- తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, - ప్రజా స్వేచ్ఛ**

పెండింగ్ బిల్లులపై గవర్నర్, రాష్ట్రపతి నిర్ణీత సమయం లోపు ఆమోదం తెలపాలంటూ జరిగిన విచారణపై సుప్రీంకోర్టు తన తీర్పును గురువారం రిజర్వ్ చేసింది. ఈ అంశంపై దాదాపు 10 రోజులపాటు- సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. అనంతరం ఈ కేసులో తుది తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు- ప్రకటించింది. రాష్ట్రపతి కానీ,

-మిగతా 3 లో



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

- 10 మంది మావోయిస్టులు మృతి..!

**రాయ్‌పూర్ - - ప్రజా స్వేచ్ఛ**

ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ ప్రాంతంలో గురువారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఇప్పటి వరకు పది మంది మృతి చెందినట్లు సమాచారం. ఇందులో ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడు మనోజ్ అలియాస్ మోందం బాలకృష్ణ సైతం ఉన్నట్లు సమాచారం. రాయ్‌పూర్ రేంజ్ ఐజీ అమ్రేష్ మిశ్రా ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరించారు. గరియాబంద్‌లో భద్రతా దళాలు, నక్సల్స్ మధ్య ఎదురుకాల్పులు జరిగాయని.. ఇంకా కాల్పులు కొనసాగుతున్నాయని

-మిగతా 3 లో



## రష్యా సైన్యంలో చేరొద్దు..

- భారతీయులకు కేంద్రం కీలక సూచన

**హైదరాబాద్**

ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధం లో కొందరు భారతీయులు రష్యా సైన్యం తరపున పనిచేస్తున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధంలో రష్యా సైన్యం తమ తరపున పోరాడేందుకు బలవంతంగా వినియోగించుకుంటోందంటూ పలువురు బాధితులు ఇప్పటికే తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కేంద్రం తాజాగా స్పందించింది. ఈ మేరకు కీలక సూచన చేసింది. రష్యా సైన్యం ఆఫర్లు ప్రమాదకరమని హెచ్చరించింది. భారతీయులు రష్యా సైన్యంలో చేరొద్దంటూ సూచించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.రష్యా సైన్యంలో భారతీయ పౌరులను నియమించుకున్నట్లు వస్తున్న నివేదికలు ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లు ప్రకటనలో తెలిపారు. రష్యా సైన్యంతో పనిచేయడం వల్ల కలిగే ప్రమాదాల గురించి ఇప్పటికే ప్రభుత్వం పలుమార్లు హెచ్చరించిందని చెప్పారు. రష్యా సైన్యంలో చేరేందుకు ఇచ్చే

-మిగతా 3 లో



రైల్వే పెండింగ్ ప్రాజెక్టులు

## పూర్తి చేయండి

**కొత్త లైన్లకు అవసరమైన భూసేకరణకు సిద్ధం**

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులు
- పర్యాటక కేంద్రాలకు అనుగుణంగా రైల్వే లైన్లు
- శంషాబాద్ అమరావతి మధ్య గ్రీన్ కారిడార్
- రైల్వే అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, - - ప్రజా స్వేచ్ఛ**

పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్మెంట్లు- ఉండాలని దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతో పాటు-

-మిగతా 3 లో



## యూరియా కృత్రిమ కొరతకు కాంగ్రెస్ కారణం

- జాబ్ క్యాలెంటర్ ప్రకటించిన నియామకాలు నిల్
- మీడియాతో బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు

**హైదరాబాద్**

కాంగ్రెస్ నాయకులు యూరియా కృత్రిమ కొరతను సృష్టించారని బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు తెలిపారు. కేంద్రం.. తెలంగాణ వాటా యూరియా ఎప్పుడో ఇచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా అమీర్ పేట్ లో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి అంశంలోనూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. గ్రూప్-1 అంశంలో న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని రామచందర్ తెలియజేశారు. గ్రూప్-1 అంశంలో టిజిపిఎస్సి తప్పుల మీద తప్పులు చేసిందని ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం కంటే ఎక్కువ సీట్లు- బిసిలకు ఇస్తామని, ఉమ్మడి వరంగల్ జిల్లాకు రాష్ట్ర కమిటీలో బిసిలకు చోటు దక్కలేదని విమర్శించారు. అధికార ప్రతినిధుల్లో వరంగల్ కు అవకాశం కల్పిస్తామని రామచందర్ రావు హామీ ఇచ్చారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌తో ఇండియా కూటమిలో ఐక్యత లేదని స్పష్టమైందని రామచందర్‌రావు అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రొఫెసర్లకు జీతాలు రావడం లేదు. యూనివర్సిటీ హాస్టళ్లు అధ్వానంగా తయారయ్యాయి. కాంట్రాక్ట్ పద్ధతిలో యూనివర్సిటీ-లను నడుపుతూ భావితరాలను అంధకారంలోకి నెట్టివేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి రూ.వెయ్యికోట్లు- ఇస్తానని సీఎం రేవంత్ గొప్పలు చెప్పారు. దావోస్‌కు


-మిగతా 3 లో

## హైదరాబాద్‌లో కుండపోత వర్షం


- విజయవాడ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్

**హైదరాబాద్ - ప్రజా స్వేచ్ఛ**

నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లుగా.. నిమిషాల వ్యవధిలోనే రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్ మెట్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రామోజీ ఫిల్మ్‌సిటీ- పరిసర ప్రాంతాల్లో గంటన్నరపాటు- కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారిపై



-మిగతా 3 లో



## అటవీ అధికారుల త్యాగం చిరస్మరణీయం

- విధి నిర్వహణలో వారి సేవలు అమోఘం
- అడవుల రక్షణ కోసంఎందరో ప్రాణత్యాగం
- అటవీ అమరుల దినోత్సవంలో మంత్రి సురేఖ

**హైదరాబాద్ - ప్రజా స్వేచ్ఛ**


విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ శాఖ అధికారుల త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం నెహ్రూ జులాజికల్ పార్కులోఅటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్, పిసిసిఎఫ్ సువర్ణ, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరిలతో కలసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 11 వ తేదీన అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవటం జరుగుతుందని అన్నారు.

-మిగతా 3 లో

## గొర్రెల స్కామ్ కేసులో ఈడి దూకుడు

- విచారణకు హాజరుకావాలని బాధితులకు నోటీసులు
- కోట్లు గోల్ మాల్ జరిగినట్లు గుర్తించిన ఈడి

3 లో



## తెలంగాణ యువత నమ్మకాన్ని వమ్ముజేసిన కాంగ్రెస్ సర్కార్

- హైకోర్టు ఆదేశించినట్లు పరీక్షను మళ్లీ నిర్వహించాలి
- అవకతవకలపై జ్యుడిషియల్ కమిషన్ వేసి ఉద్యోగాల దొంగలెవరో తేల్చాలి
- కేటీఆర్ ఎక్స్ వేదికగా డిమాండ్

**హైదరాబాద్-**


గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని యువత ఎన్నటికీ క్షమించదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ సర్కార్ అసమర్థత, కాసుల కక్కుర్తి కలగలిసి అనేక అవకతవకలకు కారణమయిందని చెప్పారు. హైకోర్టు ఆదేశించినట్లు పరీక్షను మళ్లీ నిర్వహించాలని, అవకతవకలపై జ్యుడీషియల్ కమిషన్ వేసి ఉద్యోగాల దొంగలెవరో తేల్చాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.సర్కారు కొలువుకోసం ఏళ్ల తరబడి కష్టపడి తమ విలువైన సమయాన్నీ, అమ్మా, నాన్నల కష్టార్జితాన్నీ ధారపోసిపోటీ పరీక్షలు రాసే తెలంగాణ యువత నమ్మకాన్ని వమ్ముజేసింది ఈ కాంగ్రెస్ సర్కార్. అసమర్థత, కాసుల కక్కుర్తి కలగలిసి అనేక అవకతవకలకు కారణమయ్యింది. అంగట్లో కొలువులు అమ్ముకొని నిరుద్యోగుల గొంతుకోసింది. గ్రూప్ 1 పరీక్ష నిర్వహణలో ఫెయిల్ అయిన ఈ ప్రభుత్వాన్ని యువత ఎన్నటికీ క్షమించదు. హైకోర్టు ఆదేశించినట్టు గ్రూప్-1 పరీక్ష మళ్లీ తాజాగా నిర్వహించాలి. అవకతవకలపై జుడీషియల్ కమిషన్ వేసి ఉద్యోగాల దొంగలెవరో తేల్చాలి. ఏడాదిలోపే రెండు లక్షల

-మిగతా 3 లో

## నేడు రాధాకృష్ణన్ ప్రమాణం చేసే ఛాన్స్

**హాజరుకానున్న మోడీ తదితరులు**

- రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు
- మహా గవర్నర్‌గా రాజీనామా..
- గుజరాత్ గవర్నర్‌కు అదనపు బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ప్రమాణం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి భవన్‌లో ఆయన ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేస్తారు. బాధ్యతలు చేపట్టేందుకు ముహూర్తం ఖరారు అయిందని తెలుస్తోంది. సీపీ రాధాకృష్ణన్ 15వ భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఉపరాష్ట్రపతి చేత భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అందుకోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు చురుగ్గా పూర్తి చేశారు. ప్రాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తదితర కేంద్ర మంత్రులు, విపక్ష నేతలు, ఇతర విఐపిలు హాజరయ్యే అవకాశం ఉంది. భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేశాక జరిగిన ఎన్నికల్లో రాధాకృష్ణన్ విజయం సాధించారు. సెప్టెంబర్ 9వ తేదీన జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ 148 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు-

-మిగతా లో

# నేపాల్ తాత్కాలిక ప్రధాని రేసులో కుల్మన్ ఘిసింగ్..



**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**

నేపాల్ లో రాజకీయ సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఆపద్ధర్మ ప్రధాని రేసులో కొత్త వ్యక్తి దూసుకొచ్చారు. ఎలక్ట్రికల్ ఇంజినీర్ కుల్మన్ ఘిసింగ్ ఆ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. జెన్ జెడ్ నిరసనకారులు ఆయన మద్దుతు ఇస్తున్నట్లు తెలుస్తోంది. నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ చీఫ్‌గా ఉన్న ఆయన నేపాల్ తాత్కాలిక ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కుల్మన్ ఘిసింగ్‌కు అధికార వర్గాల్లో మంచి గుర్తింపు ఉన్నది. ఆయనకు క్లీన్ ఇమేజ్ ఉంది. దేశంలో విద్యుత్తు సమస్యను తీర్చిన వ్యక్తిగా ఆయన్ను గుర్తిస్తారు.వాస్తవానికి ఆపద్ధర్మ ప్రధాని రేసులో కాఠ్మాండు మేయర్ బాలెన్ షా, మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కి ఉన్నారు. కానీ వాళ్లను వెనక్కి నెడుతూ కుల్మన్ ఘిసింగ్ ముందుకు వచ్చారు. బాలెన్ షా, సుశీల కుర్కిలు.. తాత్కాలిక ప్రధాని బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తిగా లేనట్లు తెలుస్తోంది. మాజీ జడ్జీలు ప్రధానులు కాలేరని రాజ్యాంగం చెబుతున్నట్లు కొందరు నిరసనకారులు వాదించారు. సుశీల వయసు 73 ఏళ్లు కావడంతో.. ఆ లేట్ ఏజ్‌లో ఆమె దేశాన్ని లీడ్ చేయలేరని విమర్శలు వచ్చాయి.కుల్మన్ ఘిసింగ్ ఇండియాలోని జెంషెడ్‌పూర్‌లో ఉన్న రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివారు. ఆ తర్వాత నేపాల్‌లోని పుల్‌చోక్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యను పూర్తి చేశారు. ఎంబీఏ కూడా చదివారాయన.

# ఓట్ చోరీపై త్వరలో 'అణుబాంబు' లాంటి ఆధారాలు వెల్లడిస్తా



**లక్నో న్యూఢిల్లీ -- ప్రజా స్వేచ్ఛ**

ఓట్ చోరీ గురించి త్వరలో 'అణుబాంబు లాంటి ఆధారాలు' వెల్లడిస్తానని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. బిజెపి ఓట్ చోరీకి పాల్పడుతుందని పునరుద్ఘాటించారు. ఓట్ చోరీకి సంబంధించి ఇప్పటికే కొన్ని సాక్ష్యాధారాలను వెల్లడించానని, భవిష్యత్తులో ' హైడ్రోజన్ బాంబ్ వంటి ఆధారాలు (ఎక్స్‌ప్లోజివ్ ప్రూఫ్)' బయటపెడతానని అన్నారు. తన నియోజకవర్గం రారుబరేలీలో రెండు రోజుల పర్యటన కోసం రాహుల్‌గాంధీ ఉత్తరప్రదేశ్ చేరుకున్న సంగతి తెలిసిందే. గురువారం జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిషా) సమావేశానికి అధ్యక్షత వహించారు. కలెక్టరేట్‌లోని బచత్ భవన్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే (ఎస్ఐఆర్) గురించి మాట్లాడారు. మహారాష్ట్ర, కర్ణాటక మరియు హర్యానాలో ఎన్నికలు దోచుకోబడ్డాయి. అధికారికంగా మరియు వ్రాతపూర్వకంగా నమోదు చేయబడిన సాక్ష్యాలను సమర్పించానని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంచలన, ఎక్సిప్లోజివ్ ప్రూఫ్ వెల్లడించనున్నామని అన్నారు. ఓట్ చోర్, గద్దిచోర్ అనే నినాదం దేశవ్యాప్తంగా వినిపిస్తోందని అన్నారు. రాష్ట్రాల్లో ఓట్లు దొంగిలించబడి ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయన్నది వాస్తవమని, వాటికి మీకు రుజువు ఇస్తామని హామీ ఇస్తున్నామని అన్నారు. హైడ్రోజన్ బాంబు పేలినపుడు, మొత్తం తుడిచిపెట్టుకుపోతుందని, ఇప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని బిజెపి నేతలనుద్దేశించి ఎద్దేవా చేశారు.

# లొంగిపోయిన 16మంది మావోయిస్టులు



**రాయ్‌పూర్ – ప్రజా స్వేచ్ఛ**

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో 16మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు పోలీసులు గురువారం తెలిపారు. నారాయణ్‌పూర్‌లోని సీనియర్ పోలీస్ అధికారుల ఎదుట బుధవారం సాయంత్రం వారు లొంగిపోయారని అన్నారు. ఈ 16మంది మావోయిస్టులు జనతన సర్కార్, చేతననాట్య మండలి మరియు మావోయిస్ట్ పంచాయితీ మిలీషియా సభ్యులు సహా వివిధ యూనిట్లకు చెందిన దిగువస్థాయి కేడర్లని అన్నారు. మావోయిస్ట్ గ్రూప్‌లకు రేషన్, మందులు సహా ఇతర ముఖ్యమైన వస్తువులు, ఆయుధాలు, పేలుడు పదార్థాలను అందించడం, ఐఇడిలను అమర్చడం, భద్రతాదళాల కదలికలపై నిఘా, తనిఖీలు నిర్వహించడం వంటి కార్యకలాపాల్లో పాల్గొనేవారని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులందరికీ ఒక్కొక్కరికీ రూ.50,000 సాయం అందించామని, ప్రభుత్వం పాలసీ ప్రకారం .. పునరావాసం కల్పిస్తామని అన్నారు.

# ఇండియా వర్సెస్ పాకిస్థాన్ మ్యాచ్ జరగాల్సిందే..

-సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..
-పిల్‌ను తిరస్కరించిన న్యాయస్థానం




**న్యూఢిల్లీ -- ప్రజా స్వేచ్ఛ**

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇండియా, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ జరగాల్సిందే అని కోర్టు స్పష్టం చేసింది. ఆసియాకప్‌లో భాగంగా ఆదివారం జరగనున్న మ్యాచ్‌ను రద్దు చేయాలని కొందరు కోర్టులో పిల్ దాఖలు చేశారు. శుక్రవారం ఆ పిల్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అయితే ఆ లిస్టింగ్ కుదరని కోర్టు ఇవాళ క్లారిటీ ఇచ్చింది. ఇండియా, పాకిస్థాన్ మధ్య జరిగేది క్రికెట్ మ్యాచే అని, అది జరగాల్సిందే అని కోర్టు చెప్పింది.నలుగురు న్యాయవిద్యార్థులు దాఖలు చేసిన పిటీషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఊర్వశి జైన్ నేతృత్వంలో పిటీషన్ వేశారు. జస్టిస్ జేకే మహేశ్వరి, విజయ్ బిష్ణోయ్ ధర్మాసనం ఆ పిల్‌ను లిస్టింగ్ కోసం తిరస్కరించింది. ఆదివారం మ్యాచ్ ఉందని, తమ పిల్‌ను శుక్రవారం లిస్ట్ చేయాలని కోరారు. కానీ ఆ మ్యాచ్ జరగాలని సుప్రీం ధర్మాసనం తెలిపింది. లిస్టింగ్ చేయాలని న్యాయవాది కోరుకున్నా.. కుదరదని కోర్టు పేర్కొన్నది. పెహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ తర్వాత పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడడం సబబు కాదు అని, ప్రజా మనోభావాల పట్ల సమైక్యత లేదన్న సందేశాన్ని ఇస్తుందని పిటీషనర్లు తన పిల్‌లో వాదించారు. జాతి ప్రయోజనాల కన్నా క్రికెట్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వరాదు అని తెలిపారు. జాతీయ క్రీడా పరిపాలన బిల్లు అమలకు మార్గదర్శకాలు ఇవ్వాలని పిటీషనర్లు తమ పిల్‌లో కోరారు. అడ్వకేట్లు స్నేహ రాణి, అభిషేక్ వర్మ, అనాస్ చౌదరీ పిటీషనర్ల తరపున వాదించారు.

# సోనియాగాంధీకి ఢిల్లీ కోర్టులో ఊరట

ఓటర్ నమోదుపై దాఖలైన కేసు కొట్టివేత




**న్యూఢిల్లీ,- ప్రజా స్వేచ్ఛ**

కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీకి ఢిల్లీ కోర్టులో ఊరట లభించింది. ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఆ వ్యవహారంలో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 1983లో సోనియాకు భారత పౌరసత్వం వచ్చింది. 1980 నాటి ఓటర్ జాబితా అంటూ గత నెల భాజపా నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు- సోనియా పేరును చేర్చారని పేర్కొన్నారు. అప్పటికీ ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నారని రాసుకొచ్చారు. అయితే దానిపై విమర్శలు రావడంతో 1982లో ఓటర్ జాబితా నుంచి ఆమె పేరు తొలగించారని, 1983లో మళ్లీ కనిపించిందని వెల్లడించారు. అప్పుడు కూడా పౌరసత్వం రావడానికన్నా ముందే మళ్లీ జాబితాలోకి పేరు వచ్చి చేరిందని విమర్శించారు. రాజీవ్‌ను వివాహమాడిన తర్వాత పౌరసత్వం రావడానికి 15 ఏళ్లు ఎందుకు పట్టిందని ఇక్కడ ప్రశ్నించడం లేదు. ముందే ఓటర్ జాబితాలో ఆమె పేరు కనిపించడం ఎన్నికల ప్రక్రియ దుర్వినియోగం కాకపోతే ఇంకేంటని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే దాఖలైన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది.ఈ పిటిషన్‌దారు వికాస్ త్రిపాఠి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది పవన్ నారంగ్ బుధవారం ఈ పిటిషన్‌పై వాదన వినిపించారు. ముందుగా పౌరసత్వ పరిమితిని పూర్తి చేయాలని, తర్వాత వారు ఆ ప్రాంత నివాసి అవుతారని పేర్కొన్నారు. 1980లో రేషన్ కార్డు లేదా పాస్‌పోర్ట్ నివాస పత్రంగా ఉండిఉంటుందని అన్నారు. ఆమె భారతీయ పౌరురాలైతే.. 1982లో ఆమె పేరును ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. అప్పుడు ఎన్నికల సంఘం రెండు పేర్లను తొలగించిందని, ఒకటి విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత సంజరుగాంధీది, మరొకటి సోనియాగాంధీదని ఆయన అన్నారు. ఎన్నికల సంఘం తప్పును గుర్తించిందని, ఓటర్ల జాబితా నుండి ఆమె పేరును తొలగించాలని ప్రయత్నించిందని నారంగ్ అన్నారు. 1980 సెప్టెంబర్ 4న న్యూఢిల్లీ నియోజకవర్గం ఓటరు జాబితాలో ఆమె చేర్చారని, అనంతరం 1982లో తొలగించారని అన్నారు. భారత పౌరసత్వం పొందిన తర్వాత 1983లో తిరిగి నమోదు చేయబడిందని అన్నారు. 1983లో సోనియాగాంధీ భారత పౌరసత్వం పొందారనే ఆరోపణపై దర్యాప్తు కోసం పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బిఎన్ఎస్ సెక్షన్ 175(4) కింద ఈపిటిషన్ దాఖలు చేయబడింది.

# ప్రపంచ కుబేరుడిగా లారీ ఎలిసన్..

ఎలాన్ మస్క్‌ను దాటి ఆయన ప్రపంచంలోనే అత్యంత ధనవంతు
-బ్లూమ్‌బర్గ్ ర్యాంకింగ్స్..!




**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**

ప్రపంచ కుబేరుడిగా సాఫ్ట్‌వేర్ దిగ్గజం, ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు లారీ ఎలిసన్ నిలిచారు. ఎలాన్ మస్క్‌ను దాటి ఆయన ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా మారారు. బ్లూమ్‌బెర్గ్ తాజా నివేదిక ప్రకారం.. ఒరాకిల్ షేర్లు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. దాంతో ఎలిసన్ సంపద అనేక బిలియన్ డాలర్లు పెరగడంతో ఎలాన్ మస్క్‌ను దాటేసి ప్రపంచ కుబేరుడిగా అవతరించారు. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. ఎలిసన్ సంపద ఇప్పుడు 393 బిలియన్ డాలర్లు. ఈ మొత్తం సంపద ఎలాన్ మస్క్ కంటే ఎనిమిది బిలియన్ డాలర్లు ఎక్కువ. నాలుగేళ్ల కింద ఎలాన్ మస్క్ తొలిసారిగా ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిలిచాడు. ప్రస్తుతం ఆయన నికర విలువ 385 బిలియన్ డాలర్లు. మంగళవారం వరకు మస్క్ ప్రధాన సంస్థ అయిన టెస్లా షేర్లు 14శాతం తగ్గాయి.కృత్రిమ మేధస్సు పోటీలో కష్టమర్ల నుంచి బిలియన్ డాలర్ల ఆర్డర్లు ఆధారంగా ఒరాకిల్ అద్భుతమైన ఆదాయ నివేదికను చూపించింది. దాంతో ర్యాంకింగ్స్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. అయితే, ఫోర్బ్స్ నివేదిక ప్రకారం మస్క్ ఇప్పటికీ 439 బిలియన్ డాలర్ల నికర విలువతో అగ్రస్థానంలో ఉన్నాడు. అయితే, బ్లూమ్‌బెర్గ్ తన సంపదను 385 బిలియన్లుగా చూపించింది. ఫోర్బ్స్-బ్లూమ్‌బెర్గ్ రెండూ మస్క్ ప్రైవేట్ కంపెనీలను (స్పేస్‌ఎక్స్-ఎక్స్ వంటివి) వేర్వేరుగా అంచనా వేయడం తేడాలు ఉన్నాయి. ఎలిసన్‌కు ఒరాకిల్‌లో దాదాపు 40 శాతం వాటాను ఉంది. అంటే స్టాక్ మార్కెట్ ప్రారంభమైన తక్కువ సమయంలోనే దాని పెరుగుతున్న షేర్లు ఆయన నికర విలువకు వంద బిలియన్ డాలర్లు జోడించింది. కంపెనీ తన ఆదాయాలను నివేదించినప్పుడు 300 బిలియన్లకు పైగా విలువైన కొత్త ఒప్పందాలను ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో తన క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యాపారం ఆదాయం 77 శాతం పెరిగి 18 బిలియన్లకు పెరుగుతుందని ఆశిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. నాలుగు సంవత్సరాలలో ఇది 144 బిలియన్లకు పెరుగుతుందని ఎల్లిసన్ పేర్కొన్నారు. మరో వైపు మస్క్ పెట్టుబడిదారులను ఆకట్టుకోవడంలో విఫలమవుతున్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో పడిపోయిన ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలలో కంపెనీ ఆశించిన బూమ్ ఇంకా కనిపించలేదు. మస్క్ నిరంతరం పెట్టుబడిదారుల దృష్టిని టెస్లా రోబోట్, కృత్రిమ మేధస్సు ప్రాజెక్టుల వైపు మళ్లించడానికి ప్రయత్నిస్తున్నాడు, కానీ ప్రతికూల వార్తలు ఆగడం లేదు. ఈ వేసవి ప్రారంభంలో యూరోపియన్ యూనియన్‌లో టెస్లా అమ్మకాలు 40 శాతం తగ్గాయి. వరుసగా ఏడో నెలలోనూ తగ్గాయి. మస్క్ ఎక్స్‌లో నేరపూరిత రాజకీయ నాయకులకు మద్దతు ఇచ్చిన తర్వాత కస్టమర్లు దూరమవుతున్నారు. డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతు ఇవ్వడంపై చాలామంది కోపంగా ఉన్నారు. దాంతో కొనుగోలుదారులు టెస్లా కార్లను కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. కంపెనీ యూఎస్ మార్కెట్‌లో వాటా కోల్పోతూ వస్తున్నది.

# రాజకీయంగా లక్ష్యం చేసుకునే నాపై దుష్ప్రచారం

ఈ20 ఇంధనం విషయంలో విమర్శలపై కేంద్ర మంత్రి గడ్కరీ



**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**

కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ మిశ్రమ ఇంధనాన్ని విడుదల చేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న క్రమంలో, రాజకీయంగా లక్ష్యంగా చేసుకుని తనపై సామాజిక మాధ్యమంలో దుష్ప్రచారం చేస్తున్నారని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐఏఎం) వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంప్రదాయ ఇంధనంలో 20 శాతం ఇథనాల్‌ను కలిపి ఈ20 పెట్రోల్‌ను అమ్మడంపై సామాజిక మాధ్యమంలో అతిశయోక్తి ప్రచారం చేస్తూ ఆందోళన వ్యక్తమవుతున్నదన్నారు.ఈ ఇంధనం సురక్షితమైనదని నియంత్రణ సంస్థలు, వాహన తయారీదారులు ఇద్దరూ దీనికి మద్దతు ఇస్తున్నారని చెప్పారు. అలాగే ఆటోమోటివ్ రిసెర్చ్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ), సుప్రీం కోర్టు సైతం ఈ20 కార్యక్రమంపై స్పష్టత ఇచ్చాయన్నారు. తనను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమంలో రాజకీయంగా విష ప్రచారం జరుగుతున్నదని, ఇది పెయిడ్ ప్రచారమని, కాబట్టి దీనిపై పెద్దగా దృష్టి పెట్టలేదని అన్నారు. ఇథనాల్ మిశ్రమానికి అనుకూలంగా నిర్మించనందున ఈ20 ఇంధనాన్ని వాడిన పలు పాత వాహనాలు పాడైపోతున్నాయని పలువురు వాహనదారులు దేశ వ్యాప్తంగా ఆరోపిస్తున్నా గడ్కరీ వాటిని పట్టించుకోవడం లేదు.

# బిల్లుల ఆమోదంలో గవర్నర్, రాష్ట్రపతిలకు నిర్దిష్ట గడవు

(మొదటి తరువాయి)

గవర్నర్లు కానీ బిల్లులు ఆమోదించకుండా పెండింగ్‌లో పెడితే.. ఆటోమెటిక్‌గా మూడు నెలల తర్వాత అవి ఆమోదం పొందినట్లేనంటూ గతంలో సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇక ఈ తీర్పులోని అంశాలపై ఉన్నత న్యాయస్థానం రిఫరెన్స్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోరిన విషయం విదితమే. అయితే గతంలో తమిళనాడు కేసులో గవర్నర్లు నిరవధికంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచే అధికారం లేదని.. నిర్దిష్ట సమయంలోగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ తీర్పు ప్రకారం.. కోర్టు నిజంగా అలాంటి -టైమ్ లైన్‌లు విధించే అధికారాన్ని కలిగి ఉందా?, గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయాలు న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయా? అనే అంశాలపై విస్తృత చర్చ జరిగింది. వాదనల సందర్భంగా కేంద్రం తరఫు న్యాయవాది.. ఇలాంటి సమయ పరిమితులు విధించడం రాజ్యాంగ సమతుల్యతను దెబ్బ తీయవచ్చని సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట వాదించారు. అలాగే తమిళనాడు, కేరళ, పంజాబ్ తదితర రాష్ట్రాలు మాత్రం ప్రజాస్వామ్య దేశంలో బాధ్యతగా గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయాలకు సమయం అవసరమని స్పష్టం చేశాయి. అయితే ఈ తుది తీర్పులో మాత్రం సుప్రీంకోర్టు.. గవర్నర్, రాష్ట్రపతి అధికారాలపై క్లారిటీ- ఇవ్వడమే కాకుండా.. ఈ తరహా బిల్లులు నిలిపివేత పై భవిష్యత్తులో అనుసరించాల్సిన మార్గదర్శకాలపైనా స్పష్టతనిచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ అంశం దేశంలో తీవ్ర చర్చనీయాంశమైంది. అలాంటి వేళ సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ అంశంపై ఎలాంటి తీర్పు వెలువరించనుందనే అంశంపై ఇండి కూటమిలోని భాగస్వామ్య పక్షాలు ఏలుబడిలోని రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నాయనే చర్చ సాగుతోంది.

# రైల్వే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయండి

కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీ-ని అధునాతనంగా అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్తగా ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో దక్షిణ మధ్య రైల్వే అధికారులతో పాటు-, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్కుమార్ శ్రీవాస్తవను ముఖ్యమంత్రి స్వాగతించారు. కొత్త ప్రాజెక్టులపై ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. సీఎంతో పాటు- ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రెటరీ వికాసరాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ- నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు- అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు- చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ- నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు- చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందన్నారు. దానికి అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు- చేయాలని, రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న అలైన్మెంట్‌తో పాటు- రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్మెంట్లను పరిశీలించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. హైవే వెంట రైలుమార్గం ఉండాలని, హైవేకు ఇరువైపులా కిలోమీటర్నర దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్లు విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని చెప్పారు. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు. హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు- చేయటంతో హైదరాబాద్ మహా నగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. తెలంగాణ ఇండ్రస్టియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ- ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. వికారాబాద్- కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో పాటు- గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా చేపట్టాలన్నారు. వరంగల్లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలని, భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు. కాజీపేట జంక్షన్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్తో పాటు- వరంగల్ను అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు. శంషాబాద్ నుంచి చెన్నయ్ వరకు బుల్లెట్ ట్రైన్ కొత్త రైల్వే కనెక్టివిటీ- అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# అటవీ అధికారుల త్యాగం చిరస్మరణీయం

(మొదటి తరువాయి)

ఇదే రోజు 1730 వ సంవత్సరంలో రాజస్థాన్ రాష్ట్రంలో బిష్ణోయి తెగకు చెందిన 360 మంది కేజ్రి చెట్లు- రక్షించుటకు తమ ప్రాణ త్యాగం చేసారని మంత్రి తెలిపారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విధినిర్వహణలో వన సంపద సంరక్షణ కొరకు జీవితములను త్యాగము చేసిన అటవీ సిబ్బంది సేవలను స్మరించుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 1984వ సంవత్సరము నుండి ఇప్పటివరకు 22మంది అటవీ సిబ్బంది ధైర్య సాహసాలతో అంకిత భావంతో పనిచేసి అటవీ నేరములకు పాల్పడిన నేరస్తులను పట్టు-కొనుటలో, అటవీ సంపద పరిరక్షణలో తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించినారని ఈ సందర్భంగా వారి అమూల్యమైన సేవలను గుర్తు చేశారు.అదేవిదంగా అడవులు మరియు వన్య ప్రాణులను రక్షించటంలో నిబద్ధతతో పనిచేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అధికారులు తమ శాయశక్తుల కృషి చేసి అటవీ రక్షణలో భాగంగా 2014 నుండి 2025 జూలై మాసం వరకు టేకు అలాగే మారు జాతి కలపకు సంబంధించిన నేరాలను అలాగే 10375 అటవీ భూ ఆక్రమణ కేసులను కూడా పెద్దసంఖ్యలో నమోదు చేయడం జరిగిందని అన్నారు. అలాగే 2025 సంవత్సరంలో రూ. 149.66 కోట్ల కలపకు గాను 96813 కేసులు నమోదు చేసి రూ.లు 51.50 కోట్ల జరిమానా వసూలు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే 18002 వాహనములను కూడా స్వాధీనపరచుకోవడం జరిగిందని అన్నారు. నేరస్తులు తెలియని కేసులు 29858 (÷ఖఉక్ష) నమోదు చేసి రూ. లు 67.13 కోట్ల విలువ కలిగిన టేకు మరియు మారు జాతి కలపను స్వాధీనపర్చుకొని జప్తు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిదంగా అమూల్యమైన అటవీ సంపదను పరిరక్షించడానికి ప్రజల భాగస్వామ్యముతో ఎన్నో పథకాలను మరియు చర్యలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. 174 బేస్ క్యాంపులు, 62 చెక్ పోస్టులను ఏర్పాటు- చేయడము జరిగినదని పేర్కొన్నారు. అడవి సరిహద్దుల నిర్వహణకు పశువులు అడవిలో చొరబడకుండా నియంత్రించే కాలువలు నిర్మించడం, ?సాయుధ పోలీసు దళాలు కలప అక్రమ రవాణా అరికట్టడానికి తోడ్పాటును అందిస్తున్నాయని తెలిపారు. పి. డి. యాక్ట్ మేరకు టేకు అక్రమ రవాణాదారులను కూడా అరెస్టు చేయడం జరుగుతున్నదని, అటవీ శాఖ సిబ్బంది పోలీసు అధికారుల సాయముతో ఇపటివరకు (5) కేసులు నమోదు చేశామని అన్నారు. అటవీ శాఖ సిబ్బందిని మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నేరస్తులకు కఠినమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని గుర్తు చేశారు. అదేవిదంగా అటవీ సంరక్షణ బలోపేతానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కొత్తగా 2118 వాహనాలు, (2008 మోటారు సైకిళ్ళు, ఎఫ్.బి.ఓ నుండి డి.ఆర్.ఓ వరకు, (110) మహీంద్ర తార్ జీపులు అటవీ క్షేత్రాధికారులకు అందించామని స్పష్టం చేశారు. ప్రభుత్వం 2022 సంవత్సరంలో (1516) రిక్రూట్‌మెంట్ కొరకు అనుమతి ఇచ్చిందని, అందులో భాగంగా (1393) ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు (15) మంది ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, (18) మంది ఏసిఎఫ్ ఇతర పోస్టులు రిక్రూట్‌మెంట్ పక్రియలోఉన్నాయని పేర్కొన్నారు. అడవుల రక్షణ మరియు స్మగ్లింగ్ కార్యకలాపాలను అరికట్టడం కోసం అనేక సమగ్ర చర్యలు ప్రారంభించబడ్డాయని అలాగే వన్యప్రాణుల ఆవాసాలను మెరుగుపరచడానికి పలు కార్యక్రమాలు చేపట్ట ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. అటవీ అమరవీరుల దినోత్సవం' సందర్భంగా అటవీ సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలుపుతూ మృతుల కుటు-ంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియపరచి అమరుల స్తూపం వద్ద ఈ సందర్భంగా అమూల్యమైన నివాళులు అర్పించారు. అంతకుముందు అమరుల స్తూపం వద్ద పోలీసుల గౌరవ వందనాన్ని ఉన్నతాధికారులతో కలిసి మంత్రి స్వీకరించారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ నదీమ్ అహ్మద్, పిసిసిఎఫ్ హెడ్ సువర్ణ, పిసిసిఎఫ్ వైల్డ్ లైఫ్ ఏలు సింగ్ మేరు, సి సి ఎఫ్ ప్రియాంక వర్గీస్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, వివిధ విభాగాల అధికారులు, అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఫారెస్ట్ అధికారులు, రిటైర్డ్ ఉద్యోగస్తులు, అమరుల కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల స్కామ్ కేసులో ఈడి దూకుడు

**విచారణకు హాజరుకావాలని బాధితులకు నోటీసులు**

**కోట్లు గోల్ మాల్ జరిగినట్లు గుర్తించిన ఇడి**

హైదరాబాద్

గొర్రెల పంపిణీ కుంభకోణంలో దర్యాప్తును ఈడీ అధికారులు వేగవంతం చేశారు. ఈ స్కామ్‌కు సంబంధించి ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ నెల 15న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని గొర్రెల పంపిణీ కుంభకోణం బాధితులకు నోటీసులు జారీ చేసింది. మొయినుద్దీన్ అండ్ గ్యాంగ్ ఏపీకి చెందిన రైతుల నుంచి గొర్రెలు కొనుగోలు చేసి దాదాపు రూ.2కోట్లు- మేర మోసం చేసినట్టు- ఈడీ దృష్టికి వచ్చింది. రైతులకు చెల్లించాల్సిన నగదును ప్రభుత్వ అధికారుల సాయంతో బినామీలు, సొంత ఖాతాలకు మొయినుద్దీన్ బదిలీ చేసుకున్నట్టు- ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. గొర్రెల స్కాంలో మోసపోయారంటూ ఇప్పటికే ఏపీకి చెందిన గొర్రెల కాపర్లు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 15న విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఈ కేసులో ఏసీబీ దర్యాప్తు కొనసాగుతుండగా.. ఏసీబీ విచారణ ఆధారంగా ఈడీ కూడా దర్యాప్తులోకి దిగింది. ఏపీకి చెందిన గొర్రెల కాపరులకు బ్రోకర్లు రెండు కోట్ల రూపాయలు ఎగవేసినట్లు- గుర్తించింది ఈడీ. ఈ స్కాంకు సంబంధించి ఏపీలో తీగ లాగితే డొంక కదిలినట్లు- తెలుస్తోంది. అధికారులతో బ్రోకర్లు కుమ్మక్కై పథకం నిధులను స్వాహా చేసినట్లు- ఆరోపణలు ఉన్న క్రమంలో ఈ కేసును సీరియస్ గా తీసుకుంది ఈడీ. గొర్రెలు కొనకుండానే కొన్నట్టు- రికార్డులు తయారుచేశారని.. కోట్లు- కొట్టేశారని ఆరోపిస్తోంది ఏసీబీ. ఈ స్కాం ద్వారా వేలకోట్లు- చేతులు మారాయని ఆరోపిస్తోంది ఏసీబీ. ఈ స్కాంకు సంబంధించి పశుసంవర్ధక శాఖకు చెందిన సీనియర్ అధికారులను అరెస్ట్ చేయగా.. అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ ఓఎస్డీపై కూడా కేసు నమోదయ్యింది. గొర్రెల పంపిణీ స్కీం లబ్ధిదారులు అసలు గొర్రెల వ్యాపారంతో సంబంధం లేనివారు ఉన్నట్లు- ఈడీ అధికారులు గుర్తించారు. అసలు గొర్రెల కొనుగోలు లేదా విక్రయం జరగలేదని.. కానీ వెయ్యి కోట్ల రూపాయలు మాయం చేసినట్లు- పేర్కొన్నారు. నకిలీ విక్రేతలు, ఫేక్ బిల్లులను మళ్లీ మళ్లీ పేర్కొంటూ డబ్బులు దోచుకున్నట్టు- ఆధారాలు గుర్తించారు. ఈడీ సోదాల్లో ప్రభుత్వ అధికారులకు, ఇతరులకు కిక్‌బ్యాక్ లకు సంబంధించిన డాక్యుమెంట్లు-, నకిలీ చెక్ బుక్‌లు, పాస్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

(మొదటి తరువాయి)

పేర్కొన్నారు. కొందరు మావోయిస్టులు చనిపోయి ఉండవచ్చని ఐజీ పేర్కొన్నారు.ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలోని పల్లి-బార్సూర్ రోడ్డు ప్రాంతంలో ప్రెజర్ ఐఈడీ పేలుడులో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది గాయపడ్డారు. ఈ క్రమంలో తెల్లవారుజాము నుంచి భద్రతా బలగాలు మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. దంతేవాడ పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) గౌరవ్ రాయ్ మాట్లాడుతూ.. మందుపాతరలను నిర్మూలించేందుకు చేపట్టిన ఆపరేషన్ సమయంలో పేలుడు జరిగిందని పేర్కొన్నారు. ప్రెజర్ ఐఈడీ పేలుడులో ఇద్దరు జవాన్లు గాయపడ్డారని.. ఇందులో ఒకరు ఇన్‌స్పెక్టర్ అని పేర్కొన్నారు. బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజబుల్ స్క్వాడ్ టీమ్ జవాన్ గాయపడ్డట్లు చెప్పారు. గాయపడిన ఇద్దరు దంతేవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని.. మెరుగైన వైద్య సంరక్షణ కోసం రాయ్‌పూర్‌కు హెలికాప్టర్ ద్వారా తరలించనున్నట్లు తెలిపారు. గాయపడిన సిబ్బంది సీఆర్పీఎఫ్ 195 బెటాలియన్‌కు చెందినవారని చెప్పారు.

# రష్యా సైన్యంలో చేరొద్దు.

(మొదటి తరువాయి)

ఆఫర్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న వారిని వెనక్కి పంపించాలని కోరుతూ మాస్కో అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. అంతేకాదు బాధిత కుటుంబ సభ్యులను సంప్రదిస్తున్నట్లు పేర్కొన్నారు.

# యూరియా కృత్రిమ కొరతకు కాంగ్రెస్ కారణం

(మొదటి తరువాయి)

వెళ్లి ఎన్ని కోట్ల పెట్టుబడులు తెచ్చారు? దారి ఖర్చులు కూడా వచ్చినట్లు- లేదు. రాష్ట్రంలో పరిపాలనకు పక్షవాతం వచ్చింది. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తారు తప్ప.. అమలు చేయరు. యువత గురించి ప్రభుత్వం ఆలోచించాలని రామచందర్‌రావు కోరారు.

# హైదరాబాద్‌లో కుండపోత వర్షం

(మొదటి తరువాయి)

మోకాలి లోతు నీరు ప్రవహిస్తోంది. నగర శివారులోని హయత్‌నగర్ నుంచి సిటీ-వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. యాకుత్‌పురాలో ఓ చిన్నారికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఆరేళ్ల బాలిక పాఠశాలకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడింది. బాలిక వెనుక వస్తున్న ఓ మహిళ ఇది గమనించారు. వెంటనే అప్రమత్తమై చిన్నారిని బయటకు తీశారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీకెమెరాల్లో రికార్డయ్యాయి. మరోవైపు మెదక్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా కేంద్రంలో మూడున్నరగంటల వ్యవధిలోనే 13 సెం.మీ వర్షపాతం నమోదైంది. రాజీపల్లిలో 9.2 సెం.మీ, పాతూర్‌లో 8 సెం.మీ మేర వర్షం కురిసింది. మెదక్ పట్టణంలోని రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు- ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మెదక్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీని వరద ముంచెత్తింది. వర్షం నీరు ఇళ్లలోకి చేరింది. మెదక్-హైదరాబాద్ హైవేపై భారీగా వరద నీరు చేరడంతో అధికారులు జేసీబీతో డివైడర్‌ను తొలగించారు.

# తెలంగాణ యువత నమ్మకాన్ని వమ్ముజేసిన కాంగ్రెస్ సర్కార్

(మొదటి తరువాయి)

ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్దానంపై ప్రత్యేక అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్ చేస్తున్నాను.' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# నేడు రాధాకృష్ణన్ ప్రమాణం చేసే ఛాన్స్

(మొదటి తరువాయి)



రాగా.. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు- పోలయ్యాయి. ఇక బీఆర్ఎస్, బీజేడీ, ఎస్ఎల్‌డీలు ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. మరోవైపు మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేసారు.

మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి సి.పి.రాధాకృష్ణన్ వైదొలిగారు. ఈమేరకు రాష్ట్రపతి భవన్ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల నూతన ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన నేపథ్యంలో.. గవర్నర్ పదవికి ఆయన రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇకపోతే తాను రాజీపడని జాతీయవాదినని నూతన ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సి.పి.రాధాకృష్ణన్ చెప్పారు. బుధవారం ముంబయిలోని రాజ్‌భవన్‌లో సత్కారం అందుకున్నారు. గవర్నర్‌గా ఇక్కడ కొనసాగిన 13 నెలలు.. ప్రజాజీవితంలో తనకెంతో సంతోషకరమైన సమయమని, ఆ మధుర స్మృతులను దిల్లీకి తీసుకువెళ్తున్నానని ఆయన చెప్పారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తిదాయక గాథల్ని మా తల్లి చెబుతుండేది. విదేశీ దురాక్రమణదారులపై శివాజీ పోరాడినట్లే దేశంలో అణచివేతపై అంబేడ్కర్ పోరు సాగించారు. అలాంటి దార్శనికుల వల్లనే ప్రజాస్వామ్య దేశంగా భారత్ మనుగడ సాగిస్తోంది. ఇదిలావుంటే ఇండియా కూటమి తరఫున పోటీచేసి ఓడిపోయిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి రాధాకృష్ణన్‌ను కలిసి అభినందించారు.

## సంపాదకీయం

# నేపాల్ నేర్పుతున్న పాఠాలు!




హిమాలయ ప్రాంత దేశమైన నేపాల్‌లో సోమవారం నాడు పిడుగుపాటు మాదిరి జడ్ తరం యువత ఆగ్రహ జ్వాలకు అక్కడి ప్రభుత్వమే కూలిపోయింది. తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు సైన్యం చొరవ తీసుకున్నట్లు వార్తలొచ్చాయి. సంపాదకీయం రాసిన సమయానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీలా కర్కి, తాజా ఆందోళనల వెనుక ఉన్నట్లు చెబుతున్న ఖాట్మండు స్వతంత్ర మేయర్ బాలెన్ షా, విద్యుత్‌రంగ నిపుణుడు కుల్మాన్ ఘీషింగ్ పేర్లు ముందుకు వచ్చాయి. ఒకరినే నియమిస్తారా లేక ముగ్గురితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారా అన్నది స్పష్టం కాలేదు. సామాజిక మాధ్యమాలపై కెపి శర్మ ఓలీ ప్రభుత్వం విధించిన ఆంక్షలకు వ్యతిరేకత పేరుతో వీధుల్లోకి వచ్చిన యువత ఆగ్రహం అనేక అవాంఛనీయ పరిణామాలకు దారితీసింది. ఇప్పటి వరకు 31 మంది మరణించినట్లు, ఆరువందల మందికి పైగా గాయపడినట్లు వార్త లొచ్చాయి. మాజీ ప్రధాని జల్నాద్ ఖనాల్ సతీమణి రాజ్యలక్ష్మిని మూకలు హత్య చేయటం తీవ్రమైన ఘటన. వాటి వెనుక ఎలాంటి సంఘటిత సంస్థలేదు అని చెబుతున్నప్పటికీ జరిగిన ఘటనలను చూస్తే అదృశ్యశక్తి ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. శ్రీలంక అధ్యక్షుడు, బంగ్లాదేశ్ ప్రధాని నివాసాలు, పార్లమెంట్లపై జరిగిన దాడుల్లాగే నేపాలీ యువత కూడా అదే పనిచేసిందని కొందరు చెప్పినదాని ప్రకారం చూసినప్పటికీ సోమవారం నాటి పరిణామాల వెనుక ఒక శక్తి ఉందన్నది స్పష్టం. ఎవరు ఏమిటి, ఎందుకనే మధనం జరుగుతున్నది. ఇప్పటివరకైతే నిర్దిష్ట సమాచారం లేదనే చెప్పాలి. ఆ వివరాలు ఎలా ఉన్నప్పటికీ ఈ ఉదంతం నుంచి తీసుకోవాల్సిన గుణపాఠాలు చాలానే ఉన్నాయి. నేపాలీ నిరంకుశ రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమం సాగించిన నేపాలీ కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఆయుధాలు పట్టిన మావోయిస్టులు ఎవరెంత దోహదం చేశారనేదాన్ని పక్కన పెడితే 2008లో రాచరికాన్ని తొలగించి ఫెడరల్ డెమోక్రటిక్ రిపబ్లిక్‌గా నేపాల్ అవతరించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారంలో ఉన్న రాచరిక వ్యతిరేక పార్టీలు, వ్యక్తులందరూ యువత, కష్టజీవుల ఆకాంక్షలను నెరవేర్చటంలో, మౌలిక మార్పులను తీసుకురావటంలో వైఫల్యం తాజా పరిణామాలకు దారితీసిందని చెప్పవచ్చు. విపరీతమైన అవినీతి, అధికారంలో ఉన్న కుటుంబాలకు చెందిన వారి భోగలాలసత, పెరుగుతున్న నిరుద్యోగం వంటి కారణాలు కనిపిస్తున్నాయి. ఇక్కడ కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నప్పటికీ లాటిన్ అమెరికా వామపక్ష ప్రభుత్వాల వైఫల్యాలనుంచి గుణపాఠాలు తీసుకున్నట్లు కనిపించదు. ఈ కాలంలో నేపాల్ ప్రభుత్వ విదేశాంగ విధానంలో వచ్చిన మార్పు చైనాకు దగ్గర కావటం, యువతలో ఉన్న అసంతృప్తి, ప్రభుత్వాల వైఫల్యాలను విదేశీ శక్తులు ముఖ్యంగా అమెరికా వినియోగించుకోవటంలో సఫలమైనట్లు ప్రస్తుతానికి కనిపిస్తున్న దాన్ని బట్టి చెప్పవచ్చు. భారత్, చైనాలను దెబ్బతీసేందుకు, సిక్కింను ఒక స్వతంత్ర రాజ్యంగా మార్చి పాగా వేసేందుకు ప్రయత్నించిన అమెరికాను 1970వ దశకంలో నాటి ప్రధాని ఇందిరాగాంధీ వమ్ము చేసి మనదేశంలో ఒక రాష్ట్రంగా విలీనం చేశారు. అప్పటి నుంచి నేపాల్ మీద అమెరికా కన్నుపడింది. భౌగోళికంగా నేపాల్‌కు ఉన్న ప్రాధాన్యతను బట్టి అటు చైనా ఇటు మనదేశం, బయటి నుంచి అమెరికా కూడా తమ ప్రభావం చూపేందుకు నిరంతరం ప్రయత్నించటం బహిరంగ రహస్యం. ప్రభుత్వాల వైఫల్యాలను ఆసరా చేసుకొని గతకాలపు రాచరిక వ్యవస్థను తీసుకురావాలని మితవాదశక్తులు ప్రయత్ని స్తున్నాయి. మరోవైపు గోముఖ వ్యాఘ్రం మాదిరి అమెరికా తన అనుకూల శక్తులను ప్రతిష్టించేందుకు చూస్తున్నది. ఈ రెండూ కూడా యువత ఆకాంక్షలను నెరవేర్చేవి కాదు. గాయకుడు, రచయితగా ప్రాచుర్యమై ఖాట్మండు మేయర్‌గా గెలిచిన బాలెన్ షాను తదుపరి ప్రధానిగా ముందుకు తెస్తున్నారని వార్తలు. అతగాడు పక్కా భారత వ్యతిరేకి. గతేడాది చివరిలో అమెరికా రాయబారి డీన్ ఆర్ థాంప్సన్‌తో భేటీ అయిన తర్వాత తాజా పరిణామాలు చోటు చేసుకున్నాయి. అతగాడు ప్రధానిగా గద్దెనెక్కితే పశ్చిమదేశాల కనుసన్నల్లో పని చేసే బంగ్లాదేశ్ నేత మహమ్మద్ యూనిస్ లేదా ఉక్రెయిన్ తోలుబొమ్మ జెలెన్‌స్కీ మాదిరి మారవచ్చనే అనుమానాలు చక్కర్లు కొడుతున్నాయి. అందువలన వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు తమ వైఫల్యాల నుంచి పాఠాలు తీసుకొని తిరిగి యువత, యావత్ కష్టజీవులకు దగ్గరకావటం, వారిలో విశ్వాసాన్ని పాదుకొల్పే నూతన కార్యాచరణకు పూనుకోవటం తప్ప మరొక ప్రత్యామ్నాయం కనిపించటం లేదు.

# బైడెన్ అహంకారమే.. అధ్యక్ష ఎన్నికల్లో ఓటమికి కారణం

**వాషింగ్టన్ – ప్రజా స్వేచ్ఛ**

అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ అహంకారం వల్లే 2024 అధ్యక్ష ఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోవడానికి కారణమని మాజీ ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో ఆయన మళ్లీ పోటీ చేయాలని తీసుకున్న నిర్ణయం అత్యంత బాధ్యతారహితమైనదని ఆమె వ్యాఖ్యానించారు. ఇటీవల కమలాహారిస్ రాజకీయ జీవితం గురించి.. '107 డేస్' పేరుతో తన ఆత్మకథను రాసుకున్నారు. ఈ పుస్తకంలో ఆమె అధ్యక్ష ఎన్నికల సమయంలో జరిగిన విషయాలను కూడా ఆమె ప్రస్తావించారు. అధికారంలో ఉన్నప్పుడు జో బైడెన్, జిల్ బైడెన్ తీసుకున్న వ్యక్తిగత నిర్ణయాన్ని పాటించడం అవివేకమని కమలాహారిస్ చెప్పారు. పార్టీలో తీవ్ర చర్చ జరిగిన తర్వాతే బైడెన్ తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు. ఆ తర్వాతే



తన పేరును ప్రతిపాదించారని హారిస్ తెలిపారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని ఆమె వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో పార్టీ ఓటమికి బైడెన్ అహంకారం, లెక్కలేనితనమే కారణమని ఆమె ఆరోపించారు. అయితే పోటీ నుంచి తప్పుకోమని బైడెన్‌కు సలహా ఇచ్చే పరిస్థితుల్లో అప్పుడు తాను లేనని కమలా తెలిపారు. ఒకవేళ తాను ఆ సలహా ఇచ్చి ఉంటే అది తన స్వార్థమే అవుతుందని, కేవలం అధికారం కోసం అలా చెప్పి ఉంటానని అనుకునే అవకాశం ఉంటుందని.. అందుకే తాను చెప్పలేకపోయానని ఆమె తన ఆత్మథలో చెప్పుకొచ్చారు. అధ్యక్ష పదవి అటుంచితే.. ఉపాధ్యక్షురాలిగా ఉన్నంత కాలం వైట్ హౌస్‌తో తన సంబంధాలు అంతంతమాత్రంగానే ఉండేవని తెలిపారు. బైడెన్ స్టాఫ్ తనను పూర్తిగా పక్కన పెట్టారని, తన ప్రాధాన్యాన్ని తగ్గించే ప్రయత్నం చేశారని కమలా హారిస్ ఆరోపించారు. ప్రస్తుతం కమలా వ్యాఖ్యలు ఇప్పుడు అమెరికా రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

# రైల్వే ప్రాజెక్టులకు సహకరిస్తాం






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**-భూసేకరణకు రాష్ట్ర సర్కారు సిద్ధంగా ఉంది**
**-భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అలైన్‌మెంట్ ఉండాలి**
**- సమీక్షలో సీఎం ఎ.రేవంత్‌రెడ్డి**

**-హైదరాబాద్ – ప్రజా స్వేచ్ఛ**

రాష్ట్రంలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని నొక్కి చెప్పారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్‌మెంట్లు ఉండాలనీ, దూరాభా రం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని సూచించారు. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతో పాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. రైల్వే పెండింగ్, ప్రతిపాదిత ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దక్షిణ మధ్య రైల్వే అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజరుకుమార్ శ్రీవాస్తవ, ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కొత్త రైల్వే ప్రాజెక్టులపై సంజరుకుమార్ శ్రీవాస్తవతో సీఎం చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందని గుర్తుచేశారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామనీ, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్‌మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందని వివరించారు. దానికి అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలనీ, రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న అలైన్‌మెంట్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్‌మెంట్‌ను కూడా పరిశీలించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని సూచించారు. హైవే వెంట రైలుమార్గం ఉండాలనీ, హైవేకు ఇరువైపులా కిలోమీటర్నర దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని ప్రస్తావించారు. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్‌మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు. హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను సీఎం అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు చేయటంతో హైదరాబాద్ మహానగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుంద న్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. వికారాబాద్–కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని సూచించారు. దీంతో పాటు గద్వాల–డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా చేపట్టాలని ఆదేశించారు. వరంగల్లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలనీ, భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు. కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తో పాటు వరంగల్‌ను అభివృద్ధి చేయాలనీ, అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## పేదోడి ఇంట సన్న బియ్యం సంబురం

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుహఫీజ్ మొల్సబ్.



**మెదక్ జిల్లా – ప్రజా స్వేచ్ఛ**
పేదోడి ఇంట సన్న బియ్యం అన్నం మాత్రమే కాదు పేదల నమ్మకం అని మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజ్ మల్సాబ్ అన్నారు, ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకాన్ని నిరుపేదలకు ఒక వరమని ఆయన అన్నారు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తుందని అన్నారు, పేదలు కూడా సన్నబియ్యంతో పౌష్టిక ఆహారంతో జీవించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు కూడా సన్న బియ్యాన్ని ప్రతినెల లబ్ధిదారులకు అందజేస్తుందన్నారు.

## చినురి అనసూయ అంతక్రియలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే యం.పద్మ దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా – ప్రజా స్వేచ్ఛ**
హవెలిఘనపూర్ మండల నాయకులు,జిల్లా గ్రంథాలయ మాజీ డైరెక్టర్ చినురి.శ్రీనివాస్ రెడ్డి తల్లి అనసూయ బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే యం.పద్మ దేవేందర్ రెడ్డి గురువారం కూచన్ పల్లి గ్రామానికి చేరుకుని అనసూయ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. శ్రీనివాస్ రెడ్డితోపాటు కుంటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం అంతక్రియలలో పాల్గొన్నారు. వీరి వెంట జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు యం.లావణ్య రెడ్డి, హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ శేరి నారాయణ రెడ్డి, నాయకులు కొంపల్లి. సుభాష్ రెడ్డి, కిష్ట గౌడ్, శేఖర్ రెడ్డి, లింగ రెడ్డి, రాం రెడ్డి, భయ్యన్న, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, వసతి గృహాల, కళాశాలలకు సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపించండి

కలెక్టర్ రాహుల్ రాజ్ .



**మెదక్ జిల్లా-- ప్రజా స్వేచ్ఛ**
వర్షం కారణంగా ప్రభావితమైన శిథిలావస్థలో ఉన్న అన్ని సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాల, కళాశాలల భవనాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్,ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఈ.ఈ టీ జి డబ్ల్యూ ఐ డి సి,(రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ)ఏ ఈ ,డి ఇ లు అన్ని సంక్షేమ పాఠశాలల అధికారులు, ఆర్ సి ఓ లతో గూగుల్ మీట్ ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్, కళాశాలలు పాఠశాలలు జిల్లాలో108 ఉన్నాయని వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని పురాతన పాఠశాలలు వసతిగృహాలు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే ప్రమాదం ఉన్న వాటిని క్షేత్రస్థాయిలో ఇరిగేషన్, పంచాయతీరాజ్ , పరిశీలించి మరమ్మత్తులకు గురి అయిన వాటిని వెంటనే గుర్తించి నివేదికలు తయారుచేసి. అందజేయాలన్నారు.ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో నివేదికలు తయారు చేసేటప్పుడు పారదర్శకత పాటిస్తూ గడువు తేదీలోగా తయారు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే పాఠశాలలకు వసతిగృహాలకు అవసరమగు మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అన్ని సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు ఇరిగేషన్ పంచాయతీరాజ్, ఈ.ఈ టి డబ్ల్యూ ఐ డి సి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న రికార్డ్ అసిస్టెంట్లను సన్మానించిన తహసిల్దార్



**భద్రాద్రి కొత్తగూడెం – ప్రజా స్వేచ్ఛ**
అశ్వాపురం మండల తహసిల్దార్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్లుగా గత కొంతకాలాలుగా పనిచేస్తున్న ఉద్యోగులు వై మురళీధర్ రావు మన్నెం మల్లేష్ లను ఇద్దరిని కార్యాలయంలో తహసిల్దార్ మనిధర్ సన్మానించారు వారి సొంత జిల్లాకు బదిలీగా వెళ్తున్న సందర్భంగా వారికి వీడ్కోలు పలుకుతూ శాలువలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు తహసిల్దార్ ఈ కార్యక్రమంలో కార్యాలయం ఉద్యోగులు ఆర్ ఐ లు లీలావతి జూనియర్ అసిస్టెంట్ శెట్టి నరసింహారావు యూ డి సి కనక మహాలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో ఐదురోజులు భారీ వర్షాలు.. ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ..!

**మెదక్ జిల్లా– ప్రజా స్వేచ్ఛ**
తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉందని తెలిపింది. శనివారం నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో.. ఆదివారం నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ నారాయణపేట, వపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. సోమవారం



కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడుతాయని వాతావరణశాఖ ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, ములుగు, భూపాలపల్లి, రంగారెడ్డి, కొత్తగూడెం, జోగులాంబ గద్వాల జిల్లా సహా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 13.2, ములుగు జిల్లాల్లోని మేడారంలో 13.9 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

# బిజెపి,బిఆర్ఎస్ లను భూస్థాపితం చేసే బాధ్యత బీసీలదే

**-జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు. నారాయణవరపు శ్రీనివాస్ వెల్లడి.**
**-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడేపల్లి కృష్ణమాచారి సంయుక్త ప్రకటన.**

**తల్లాడ – ప్రజా స్వేచ్ఛ**
రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా ఉద్యోగాలకు సంబందించి ఒక బిల్లును,స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లకు సంబందించి రెండొవ బిల్లు ను ఆమోదింపజేసి గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపినప్పటికీ నేటికీ కూడా భారతీయ జనతా పార్టీ దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేయటం పట్ల జాతీయ బిసి సంక్షేమసంఘం ఖమ్మంజిల్లాఅధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ ఆగ్రహం వేక్తం చేశారు గురువారంనాడు తల్లాడ మండలం వెంకటిగిరి గ్రామనికి చెందిన బిసి నాయకుడు మలేలా వెంకటాచారికి ఇటీవలే కంటి ఆపరేషన్ జరగగా అతనని పరామర్శించిన అనంతరం శ్రీనివాస్



విలేకరుల సమావేశాని నిర్వహించారు. ఈ సమావేశాని ఉద్దేశించి జాతీయ బిసి సంక్షేమ సంఘంఖమ్మంజిల్లాఅధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ మాట్లాడుతు బీసీల వ్యతిరేక పార్టీ అయినటువంటి భారతీయ జనతా పార్టీని భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు గత పది సంవత్సరాలు బి ఆర్ ఎస్ పార్టీ పాలన లో బీసీలను అన్ని రంగాల్లో అణిచివేసిందని అటువంటి పార్టీలకు ఈ తెలంగాణ రాష్ట్రంలో స్థానం లేకుండా చేయాల్సిన బాధ్యత బీసీలుగా మనపై ఉందని ఆయన పేర్కొన్నారు భవిష్యత్ లో ఏ ఎన్నికలు వచ్చిన ఆ రెండు పార్టీల్ని భూస్థాపితం చేయాల్సిన బాధ్యత బీసీలుగా మనమీద ఉందని ఆయన తెలిపారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడేపల్లి కృష్ణచారి మాట్లాడుతూ 79 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో బీసీలు అన్ని రంగాల్లో వెనకబడ్డారని ఇకనైనా తెలంగాణా లో ఉన్న అని రాజకీయ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన పంపిన బిల్లులను వెంటనే భారతీయ జనతా పార్టీ ఆమోదించి రాజ్యాంగ సవరణ చేసి షెడ్యూల్ తొమ్మిదిలో చేర్చేవిధంగా ఆ పార్టీ పైఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారుఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి మసనం శివ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల్లి శ్రీనివాస్ యువజన సంఘం సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు మరి ప్రసాద్ మరీ మరీదు ప్రసాద్ వర్గాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకటేశ్వర రావు పెట్టావా రుద్రాక్షల లక్ష్మాచారి నరసింహాచారి జీవన వెంకటేశ్వరరావు దీవెల వెంకటేశ్వర్లు పులిపాక వెంకటరామయ్య పాకలపాటి వీరభద్రరావు నీ పక్కన నీ పక్కన ఉత్సవాల్లో పడి పేరు చెప్పు కూరపాటి సతీష్ గడ్డంబాను ఆన బత్తుల వెంకటేశ్వర్లు కూరపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వీధి కుక్కలు దాడిలో మరణించిన కోట్ల అధిపతి

"తస్మాత్ జాగ్రత్త 'జిల్లా ప్రజలకు .



**మహబూబాబాద్ – ప్రజా స్వేచ్ఛ**
అత్యంత విచారకరమైన (వాగ్ బక్రి టీ పౌడర్ యజమాని) పరాగ్ దేశాయ్, ?2,000 కోట్ల విలువైన ఆస్తుల యజమాని మరియు 60 దేశాలలో వ్యాపారాన్ని విస్తరించి ఉన్నాడు, ఉదయం నడకలో వీధికుక్కలు అతనిపై దాడి చేశాయి. వాటి నుండి తప్పించుకునే ప్రయత్నంలో, అతను జారిపడి, తలపై పడి, మెదడులో రక్తస్రావం అయ్యాడు. అతను అపస్మారక స్థితిలో పడి ఉండగా, కుక్కలు అతన్ని మరింత కరిచాయి. 7 రోజులు ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడిన తర్వాత, అతను 49 సంవత్సరాల వయస్సులో విచారకరంగా మరణించాడు. దయచేసి వీధికుక్కల పట్ల జాగ్రత్తగా ఉండండి మరియు ఈ సందేశాన్ని అందరికీ షేర్ చేయండి. నిజంగా విషాదకరమైన మరియు హృదయ విదారకమైన సంఘటన. ప్రతి ఒక్కరూ చదవాలి మరియు అప్రమత్తంగా ఉండాలి – వీధికుక్కల నుండి మిమ్మల్ని మరియు ఇతరులను రక్షించుకోండి.

## వాసవి క్లబ్ ద్వారా మహిళకు ఉచిత కుట్టు మిషన్

**కరీంనగర్, -- ప్రజా స్వేచ్ఛ**
వాసవి శాతవాహన క్లబ్ ఆధ్వర్యంలో సంధ్యారాణి అనే మహిళకు ఉచితంగా కుట్టు మిషన్ అందజేశారు. క్లబ్ అధ్యక్షులు ఎలగందుల మునీందర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెక్రటరీ బండ సాగర్, కోశాధికారి తొడుపునూరి విశ్వనాథం, పైడ ప్రభాకర్, యాంసాని ఆగయ్య తదితరులు పాల్గొన్నారు. స్వయం ఉపాధికి తోడ్పాటు అందించేలా మహిళకు మిషన్ అందజేయడం అభినందనీయమని స్థానికులు ప్రశంసించారు.

## సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు పంపిణి...



**మల్లాపూర్ – ప్రజా స్వేచ్ఛ**
:మండలం లొని మొగిలిపేట గ్రామానికి చెందిన నలుగురికి చెందిన ఒక లక్ష ఇరవై ఆరు వేల రూపాయలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నరసింగారావు
ఈ కార్యక్రమం లొ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు గోల్కొండ రమేష్ ఏలేటి జలపతి రెడ్డి.దండవేణి రాజేందర్.మాసుల బుచ్చి రెడ్డి.మాసుల చిన్నయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తది తదితరులు పాల్గొన్నారు

## ఆటో-కారు ఢీ

విద్యార్థులు, కూలీలకు తీవ్ర గాయాలు



**తెలకపల్లి,– ప్రజా స్వేచ్ఛ**
తెలకపల్లి మండల పరిధిలోని గోలగుండం గ్రామ శివారులో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.
వ్యవసాయ కూలీలు, విద్యార్థులతో వెళుతున్న ప్యాసింజర్ ఆటోను ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతతో ఆటో పంట పొలాల్లోకి పల్టీ కొట్టింది. గాయపడిన వారిని స్థానికులు అప్రమత్తంగా స్పందించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. క్షతగాత్రుల పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు సమాచారం.

## బీరంగూడ పాఠశాల విద్యార్థులకు గీతంలో సాంకేతిక అవగాహన



**పటాన్ చేరు ప్రతినిధి – ప్రజా స్వేచ్ఛ**

పాఠశాల విద్యార్థులలో విద్య, సాంకేతిక అవగాహనను ప్రోత్సహించడంలో భాగంగా, బీరంగూడలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం రెండు రోజుల చేరువయ్యే (ఔట్ రీచ్) కార్యక్రమాన్ని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సెప్టెంబర్ 10-11 తేదీలలో నిర్వహించింది. జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం, భవిష్యత్తు ఆవిష్కరణల వైపు యువ మనస్సులను ప్రేరేపించడం లక్ష్యంగా సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ), ఐటీ టూల్స్, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ లోని ప్రాథమిక భావనలను పరిచయం చేశారు. ఉద్భవిస్తున్న సాంకేతికతలపై ఆచరణాత్మక అవగాహన కల్పించారు బీరంగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుల్లాభొట్ల వసంత అభ్యర్థన మేరకు, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ – కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.ఆర్.శాస్త్రి ఆమోదం, పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది పిల్లల భవిష్యత్ విద్యా ప్రయాణానికి అధునాతన జ్ఞానం, ప్రేరణను పొందేలా చేసింది. ఈ కార్యక్రమాన్ని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.నవీన్ కుమార్ సమన్వయం చేశారు.

## జర్నలిస్టుల సమస్యలపై మంత్రి పొంగులేటి సమీక్ష సమావేశం





**హైదరాబాద్ ప్రతినిధి – ప్రజా స్వేచ్ఛ**

నిజమైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐ&పిఆర్ స్పెషల్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక,సీపీఆర్వో జి. మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ,జర్నలిస్ట్ల హెల్త్ పాలసీ,జర్నలిస్టుల అవార్డులు,జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశాలపై కార్మిక,ఆరోగ్య,హెూం,ఆర్థికశాఖ అధికారులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

## విజయవంతంగా ఏకగ్రీవంగా పూర్తి అయిన TSGREA మెట్ పల్లి ఎన్నికలు,



**మెట్ పల్లి – ప్రజా స్వేచ్ఛ**

పట్టణంలో విజయవంతంగా టిఎస్జీఆర్ఏ ఎన్నికలు, నూతన కార్యవర్గం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి ఎన్నికల్లో అధ్యక్షులుగా N.రాజేశ్వర్ రావు, C. నంద గోపాల్ సెక్రటరీ, L. చిన్నయ్య ఫైనాన్స్ సెక్రటరీ,D.నర్సయ్య అసోసియేట్ అధ్యక్షులుగా A.రాజేందర్ ఉపాధ్యక్షులు, బుక్య కేస్లీ బాయి ఉపాధ్యక్షులు (మహిళ), E.సుభాష్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, P. శివనందం జాయింట్ సెక్రెటరీ, K. రాములు పబ్లిసిటీ సెక్రటరీ, G.అంజయ్య జిల్లా కౌన్సిలర్, S. కాంతయ్య జిల్లా కౌన్సిలర్, V. విజయ భాస్కర్ జిల్లా కౌన్సిలర్ గా ఏకగ్రీవవంగా ఎన్నకైనారు. ఎన్నుకోబడిన నూతన కార్యవర్గ సభ్యులకు శాలువాలతో సన్మానం చేయడం జరిగింది.

## గురుకుల పాఠశాలను సందర్శించిన మండల ప్రత్యేక అధికారి

**గోపాల్ పేట్ – ప్రజా స్వేచ్ఛ**

మండలంలోని బుద్ధారం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను గురువారం మండల ప్రత్యేక అధికారి ఆంజనేయులు గౌడ్ సందర్శించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులు, వసతి గృహంలో వసతులు విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్ ఆరోగ్యం కు సూచించారు.

# సీఎం సహాయనిది పేదలకు పెన్నిధి

**జి.మధుసూదన్ రెడ్డి ఎమ్మెల్యే దేవరకద్ర**



**అడ్డాకుల.– ప్రజా స్వేచ్ఛ**

అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన మునగాల యేసెపు గుండెకు సంబంధించిన శాస్త్ర చికిత్స కొరకు నిమ్స్ ఆస్పత్రికి సీఎం సహాయ నిధి ద్వారా, దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ కు విన్నవించగా,ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ, రూ,2.లక్షల 50.వేల ఎల్ఓసి ని, వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్ రెడ్డి (GMR).ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్లో అత్యవసర వైద్య సేవలు పొందిన పేదలను ఆదుకునేందుకు, రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం సహాయ నిధి లెటర్ ను లబ్ధిదారునికి ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయడం జరిగింది.,మునగాల యేసేపు కు,మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 2,లక్షల 50 వేల, ఎల్ఓసి లెటర్ ను గురువారం ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా లబ్ధిదారుని కుమారుడు ఎం.ప్రవీణ్ కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ, అనారోగ్యపరంగా, ఆపదలో ఉన్న వారికి, ఆర్థికంగా అందించాలనే లక్ష్యంతో,మెరుగైన వైద్య చికిత్స కు,రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ప్రతి లబ్ధిదారునికి ఎన్ ఓ సి ఇవ్వడం జరుగుతుందని,ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో, అడ్డాకుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట శ్రీహరి,జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గంగుల.విజయ్ మోహన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె.వేగనాథ్, పరశురాములు, చెన్నకేశవ్,రాములు, బుచ్చన్న యాదవ్, ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం. యేసేపు కుటుంబ సభ్యులు, రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి గార్కి, దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ గార్కి, ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# గూడెం కార్మికులకు ఆపన్న హస్తం

- -సాయిబాబా సెల్యులోజ్ పరిశ్రమలో గాయపడ్డ కార్మికుడికి అండగా ఎమ్మెల్యే జిఎంఆర్
- -ప్రమాదంలో కుడి చేయి కోల్పోయిన కార్మికుడు అమర్ సింగ్
- -యాజమాన్యంతో మాట్లాడి రూ.25 లక్షల పరిహారం అందచేత
- -భవిష్యత్తులో అండగా ఉంటానని భరోసా
- -ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబం



**పటాన్ చేరు ప్రతినిధి – ప్రజా స్వేచ్ఛ**

కార్మిక నేపథ్యం నుంచి వచ్చిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. పటాన్ చెరు పారిశ్రామికవాడలో ఎక్కడ ప్రమాదం జరిగిన కార్మికుల పక్షాన నిలబడుతూ యాజమాన్యంతో మాట్లాడి మెరుగైన పరిహారం అందిస్తూ కార్మిక పక్షపాతిగా నిలుస్తున్నారు. గతంలో అగర్వాల్ రబ్బర్ ఫ్యాక్టరీలో మరణించిన కార్మికుడికి 60 లక్షల రూపాయల నష్టపరిహారాన్ని ఇప్పించిన తరహాలోనే ఇదే రీతిలో పటాన్ చెరు లోని సాయిబాబా సెల్యులోజ్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో గాయపడ్డ కార్మికుడికి ఆపన్న హస్తం అందించారు. గత శనివారం శ్రీ సాయిబాబా సెల్యులోస్ పరిశ్రమలో ప్రమాదవశాత్తూ అమర్ సింగ్ అనే కార్మికుడు (59) తీవ్రంగా గాయపడ్డాడు. మెషిన్ లో పడి కుడి చేయిని కోల్పోయాడు. దీంతో తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులతో పాటు కార్మికులు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని ఆశ్రయించారు. దీంతో రంగంలోకి దిగిన ఎమ్మెల్యే గూడెం బాధిత కార్మికుడికి మెరుగైన చికిత్స అందించాలని ధ్రువ ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆదేశించారు. అనంతరం శ్రీ సాయి బాబా సెల్యులోజ్ పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి వారిని ఒప్పించి రూ.25 లక్షల పరిహారాన్ని ఇప్పించారు. బుధవారం సాయంత్రం పటాన్చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆర్థిక సహాయాన్ని అందించారు. భవిష్యత్తులోనూ అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం బాధిత కార్మికుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారాన్ని మర్చిపోలేమన్నారు. కార్మికుల పక్షాన నిలబడి సహాయం చేస్తున్న జిఎంఆర్ కు తామంతా రుణపడి ఉంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజన్ సింగ్, ఆకుల శ్రీశైలం, పరిశ్రమ ప్రతినిధులు, బొందిలి సంక్షేమ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- -అధికారులు.. కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేయాలి..
- -పనుల్లో నాణ్యత లోపిస్తే అధికారులు.. ఏజెన్సీలపై కఠిన చర్యలు.
- -ప్రజలకు జవాబుదారీగా పని చేయండి..
- -నిరంతర పర్యవేక్షణతో సమగ్ర ఫలితాలు..
- -పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి
- -జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం



**– ప్రజా స్వేచ్ఛ పటాన్ చేరు ప్రతినిధి**

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని.. నిర్దేశించిన లక్ష్యం లోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు గురువారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్లతో భారతి నగర్, పటాన్చెరు, రామచంద్రాపురం డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడు డివిజన్లో పరిధిలో చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు ప్రధానంగా సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రహరీ గోడలు, స్మశాన వాటికలో అభివృద్ధి పనులు, సామాజిక ఫంక్షన్ హాళ్లు, పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ.. పలు అభివృద్ధి పనుల్లో వేగం మందగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు కాంట్రాక్టర్లు సమన్వయం చేసుకుంటేనే సత్ఫలితాలు సాధిస్తామని సూచించారు. నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులు పూర్తిచేస్తేనే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలియాలంటే నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు నిధుల విడుదల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే ప్రభుత్వంతో చర్చించి వెంటనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడొద్దు అని.. నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోతే సంబంధిత ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు అధికారులు సైతం కఠిన చర్యలకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు నూతనంగా చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించి నివేదికలు అందిస్తే ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. అభివృద్ధి పనుల పురోగతిపై నిరంతరం సమీక్షలు చేయనున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, ఏఈలు శివకుమార్, ఫైజన్, దివ్య తేజ, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు..

## నోముల మారయ్య మృతదేవానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**రామన్నపేట – ప్రజా స్వేచ్ఛ**



రామన్నపేట మండల మాజీ జెడ్పిటిసి నోముల పద్మ భర్త నోముల మారయ్య మాజీ సర్పంచ్ గురువారం ఉదయం మరణించగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మృతదేవం వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ ఎంపీపీ నీల దయాకర్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్ గొరిగే నరసింహ పున్న వెంకటేశం ఎండి అమీర్ జిల్లా నాయకులు ఎస్కే చాంద్ నాయకులు బత్తుల వెంకన్న కూనూరు ముత్తయ్య ఆవుల నరేందర్ జెట్టి శివప్రసాద్ ఆవుల శ్రీధర్ లవణము ఉపేందర్ చిప్పలపల్లి రవి రేమిడాల వెంకన్న గట్టు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

# ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపీ

**మరో 24 పైసలు దిగజారి తొలిసారి**

**88.35కు పడిన విలువ**

**ఇంట్రా–డేలో 88.49 స్థాయికి..**



**ముంబై,**
డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ గురువారం ట్రేడింగ్‌లో ఆల్‌టైమ్ కనిష్ఠానికి దిగజారింది. మునుపెన్నడూ లేనివిధంగా 88.35 స్థాయి వద్ద ముగిసింది. బుధవారం ముగింపుతో చూస్తే 24 పైసలు క్షీణించింది. భారత్–అమెరికాల మధ్య టారిఫ్‌ల అంశం.. రూపీపై గట్టిగానే ప్రభావం చూపినట్టు నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. దేశీయ మార్కెట్ల నుంచి తరలిపోతున్న విదేశీ మదుపరుల పెట్టుబడులు సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసినట్టు ఫారెక్స్ ట్రేడర్లు అభిప్రాయపడుతున్నారు. అలాగే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు గతకొద్ది రోజులుగా పెరుగుతుండటంతో రూపాయిపై ఒత్తిడి నెలకొన్నదని కూడా పేర్కొంటున్నారు. దిగుమతిదారుల నుంచి డాలర్‌కు భారీగా డిమాండ్ కనిపించింది. ఈ క్రమంలోనే ఒకానొక దశలో 88.49కి రూపీ వాల్యూ పతనమైంది. అయితే చివరకు తిరిగి కోలుకున్నది. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి సానుకూల సంకేతాలు రావడమే ఇందుకు కారణంగా చెప్తున్నారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ కూడా ఇరు దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు సత్ఫలితాలనిచ్చే దిశగానే సాగుతున్నట్టు తెలిపారు. అయినప్పటికీ వడ్డీరేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ నిర్ణయాలు, ఆ దేశ ద్రవ్యోల్బణం గణాంకాలు, ట్రంప్ సర్కారు ఆయా దేశాలపై వేస్తున్న ప్రతీకార సుంకాలు.. డాలర్ విలువ స్థిరత్వాన్ని ప్రభావితం చేయగలవన్న అంచనాలైతే ఉన్నాయి. కాగా, రూపాయి విలువ ఇంకా పతనమైతే.. అది దేశ ఆర్థిక వ్యవస్థనూ దెబ్బతీయడం ఖాయమనే చెప్పవచ్చు. దిగుమతులు భారమై, ద్రవ్యోల్బణం విజృంభించి, ఆర్బీఐ కఠిన ద్రవ్యవిధానాలతో దేశ జీడీపీ వృద్ధిరేటు మందగమనంలోకి జారుకునే వీలున్నది. అందుకే ఆర్బీఐ జోక్యంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఇక ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా డాలర్‌తో చూస్తే రూపాయి మారకం విలువ దాదాపు 3 రూపాయల మేర కోల్పోవడం గమనార్హం.

## ఇన్ఫీ 18 వేల కోట్ల బైబ్యాక్




**న్యూఢిల్లీ,**
: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ మరోసారి భారీ స్థాయి బైబ్యాక్‌ను ప్రకటించింది. రూ.18 వేల కోట్ల విలువైన షేర్ల తిరిగి కొనుగోలు ప్రక్రియకు కంపెనీ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కంపెనీ చరిత్రలో ఒకేసారి ఇంతటి స్థాయిలో బైబ్యాక్ ప్రకటించడం ఇదే తొలిసారి. రూ.5 ముఖ విలువ కలిగిన 2.41 శాతానికి సమానమైన 10 కోట్ల ఈక్విటీ షేర్లను తిరిగి హస్తగతం చేసుకోనున్నది. ఒక్కో షేరుకు రూ.1,800 చెల్లించనున్నది. గురువారం స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి నమోదైన షేరు ధర కంటే 19 శాతం ఎక్కువకు కొనుగోలు చేయనున్నది. ఈ బైబ్యాక్ ప్రతిపాదనపై కంపెనీ బోర్డు సమావేశమై అనుమతినిచ్చింది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం చివరినాటికి కంపెనీ వద్ద 884 మిలియన్ డాలర్ల(రూ.7,805 కోట్లు) నగదు నిల్వలు ఉన్నాయి. ఈ మొత్తాన్ని బైబ్యాక్ కోసం వినియోగించబోతున్నది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర 1.51 శాతం నష్టపోయి రూ.1,509.50 వద్ద నిలిచింది. 2017లో సంస్థ తొలిసారిగా బైబ్యాక్‌ను ప్రకటించింది. మళ్లీ ఎనిమిదేండ్ల తర్వాత షేర్లను తిరిగి కొనుగోలు చేయబోతున్నది. అప్పట్లో 4.92 శాతానికి సమానమైన 11.3 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఒక్కో షేరుకు రూ.1,150 చెల్లించి మొత్తంగా రూ.13 వేల కోట్ల నిధులను వెచ్చించింది.

## వాహన రంగానికి జోష్.. సియామ్ వర్గాలు వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11**
కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం ఆటోమొబైల్ రంగం టాప్‌గేర్‌లో దూసుకుపోవడానికి దోహదం చేయనున్నదని ఆటోమొబైల్ తయారీదారుల సంఘం సియామ్ వెల్లడించారు. వాహన ధరలు భారీగా తగ్గనుండటంతో అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోయే అవకాశాలున్నాయని తెలిపింది. ప్రస్తుత పండుగ సీజన్ అమ్మకాలు రెండంకెల వృద్ధి సాధించనున్నదని ఆశిస్తున్నట్టు సియామ్ ప్రెసిడెంట్




శైలేష్ చంద్ర తెలిపారు.జీఎస్టీ వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను ఆటోమొబైల్ సంస్థలు ఇప్పటికే తమ వాహన ధరలను తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి కూడా. అలాగే ఎగుమతులు కూడా 14 శాతం ఎగబాకి 7.7 లక్షల యూనిట్లు ఇతర దేశాలకు ఎగుమతి అయ్యాయి. కార్లతోపాటు ద్విచక్ర వాహన అమ్మకాలు తిరిగి పుంజుకునేదశకు చేరుకున్నాయని, ప్రస్తుతం సింగిల్ డిజిట్‌లో వృద్ధి నమోదుకాగా, వచ్చే నెల నుంచి రెండంకెల స్థాయిలో ఉంటుందని ఆయన అంచనావేస్తున్నారు.

# బంగ్లా బోణీ.. హాంకాంగ్‌పై ఘన విజయం

**అబుదాబి**
ప్రతిష్టాత్మక ఆసియాకప్‌లో బంగ్లాదేశ్ బోణీ కొట్టింది. గురువారం జరిగిన గ్రూపు–బీ పోరులో బంగ్లా 7 వికెట్ల తేడాతో హాంకాంగ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన బంగ్లా..హాంకాంగ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బంగ్లా బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొంటూ హాంకాంగ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. నిజాకత్‌ఖాన్(42), జీషన్ అలీ (30) రాణించారు. తంజీమ్ హసన్ (2/21), రిషాద్ (2/31), తస్కిన్ (2/38) రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన బంగ్లా 17.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. కెప్టెన్ లిటన్‌దాస్ (59), తౌహిద్ హృదయ్ (35 నాటౌట్) విజయంలో కీలకమయ్యారు.

**ఆడుతూ పాడుతూ:**
హాంకాంగ్ నిర్దేశించిన 144 పరుగుల లక్ష్యాన్ని బంగ్లా ఆడుతూ పాడుతూ ఛేదించింది. జట్టు 24 పరుగులకే



శుక్లా బౌలింగ్‌లో ఓపెనర్ పర్వేజ్ హుస్సేన్(19) వికెట్ కోల్పోయిన బంగ్లా వెనుకకు తగ్గలేదు. అనుభవం లేని హాంకాంగ్ బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ పరుగులు సాధించారు. భారీ షాట్ ఆడే క్రమంలో ఇక్బాల్ వేసిన ఆరో ఓవర్‌లో తంజిద్‌హసన్(14)..నిజాకత్‌కు క్యాచ్ ఇచ్చి రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి బంగ్లా రెండు వికెట్ల నష్టానికి 51 పరుగులు చేసింది. ఈ క్రమంలో తౌహిద్‌తో కలిసి కెప్టెన్ లిటన్ దాస్ ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశాడు. క్రీజులో కుదురుకునేందుకు ఒకింత సమయం తీసుకున్న దాస్..ఆ తర్వాత హాంకాంగ్ బౌలర్లను లక్ష్యంగా చేసుకున్నాడు. ఇన్నింగ్స్ 14వ ఓవర్‌లో వరుసగా రెండు బౌండరీలతో దాస్ టచ్‌లోకి వచ్చాడు. ఈ క్రమంలో ముర్తజా 16వ ఓవర్‌లో భారీ సిక్స్‌తో 33 బంతుల్లో దాస్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. విజయానికి రెండు పరుగుల దూరంలో దాస్..ఇక్బాల్ బౌలింగ్‌లో ఔట్ కావడంతో మూడో వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది.

**సంక్షిప్త స్కోర్లు**
హాంకాంగ్: 20 ఓవర్లలో 143/7( నిజాకత్ ఖాన్ 42, జీషన్ అలీ30, తంజిమ్ 2/21, రిషాద్ 2/31),
బంగ్లాదేశ్: 17.4 ఓవర్లలో 144/3 (దాస్ 59, తౌహిద్ 35 నాటౌట్, ఇక్బాల్ 2/14, శుక్లా 1/32).

# స్పోర్ట్స్

## సెమీస్‌కు పూజారాణి..

### భారత్‌కు మరో రెండు పతకాలు ఖాయం



**లివర్‌పూల్**
ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు మరో రెండు పతకాలు ఖాయమయ్యాయి. సీనియర్ బాక్సర్ పూజారాణి.. మహిళల 80 కిలోల విభాగంలో సెమీస్‌కు చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. క్వార్టర్స్‌లో పూజా.. 3–2తో ఎమిలా కొటెర్స (పోలండ్)ను ఓడించింది. ఈ టోర్నీలో ఇప్పటికే నుపుర్ షెరోన్, జైస్మీన్ లంబోరియా సెమీస్ చేరిన విషయం విదితమే.మహిళల 57 కిలోల క్వార్టర్స్‌లో జైస్మీన్.. 5–0తో మమజొనోవా (ఉజ్బెకిస్థాన్)పై ఏకపక్ష విజయం సాధించింది. కాగా రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అయిన నిఖత్ జరీన్ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. పురుషుల విభాగంలో అవినాశ్ జమ్వాల్ సైతం క్వార్టర్స్‌లోనే ఇంటిబాట పట్టాడు.

## ఆయుష్ అదుర్స్.. జపాన్ స్టార్ షట్లర్ నరొకకు షాక్

### క్వార్టర్స్‌కు సేన్, సాత్విక్ జోడీ

**హాంకాంగ్**
యువ భారత షట్లర్ ఆయుష్ శెట్టి హాంకాంగ్ ఓపెన్‌లో మరో సంచలన ప్రదర్శన చేశాడు. గురువారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఈ కర్నాటక కుర్రాడు.. 21–19, 12–21, 21–14తో జపాన్ స్టార్ షట్లర్, మాజీ ప్రపంచ రెండో ర్యాంకర్ కొడాయ్ నరొకకు షాకిచ్చి క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. ఈ ఏడాది జూన్‌లో యూఎస్ ఓపెన్ సూపర్ 300 టైటిల్ గెలిచిన ఆయుష్.. 72 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో నరొకను చిత్తుచేశాడు.తొలి గేమ్‌లో 13–15తో




వెనుకబడ్డప్పటికీ పదునైన స్మాష్‌లతో అతడు 21–19తో ఆ గేమ్‌ను గెలుచుకున్నాడు. కానీ నరొక జోరు పెంచడంతో రెండో గేమ్ అతడి సొంతమైంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో భారత కుర్రాడు దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థిపై ఎదురుదాడికి దిగాడు. 17–10తో ఉండగా నరొక చేసిన తప్పిదాలను తనకు అనుకూలంగా మలుచుకుని గేమ్‌తో పాటు మ్యాచ్‌నూ సొంతం చేసుకున్నాడు.ఇద్దరు భారత షట్లర్లు లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ మధ్య సాగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సేన్‌నే విజయం వరించింది. ప్రిక్వార్టర్స్‌లో అతడు.. 15–21, 21–18, 21–10తో ప్రణయ్‌ను ఓడించాడు. క్వార్టర్స్‌లో సేన్.. ఆయుష్‌ను ఢీకొననున్నాడు. పురుషుల డబుల్స్‌లో ప్రపంచ 9వ ర్యాంకర్లు సాత్విక్–చిరాగ్.. 18–21, 21–15, 21–11తో సుక్పున్–తీరరత్సకుల్ (థాయ్‌లాండ్)ను చిత్తు చేసి క్వార్టర్స్ చేరారు.

## అందరూ మహిళలే.. ఐసీసీ చరిత్రాత్మక నిర్ణయం

**దుబాయ్**
ఈ నెల 30 నుంచి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న మహిళల వన్డే ప్రపంచకప్‌లో అంపైరింగ్ బాధ్యతలను పూర్తిగా మహిళలే నిర్వర్తించనున్నారు. వన్డే ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా రాబోయే ఎడిషన్‌లో ఫీల్డ్ అంపైర్లు, మ్యాచ్ రిఫరీలు అంతా మహిళలే ఉండనున్నారు. ఈ మేరకు ఐసీసీ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది.ఈ సందర్భంగా ఐసీసీ చైర్మన్ జై షా స్పందిస్తూ.. 'మహిళల క్రికెట్ ప్రయాణంలో ఇది ఒక మైలురాయి మాత్రమే కాదు.. క్రికెట్‌లో స్త్రీ, పురుషుల సమానత్వానికి ఐసీసీ నిబద్ధతకు నిదర్శనం' అని పేర్కొన్నారు. గతంలో కామన్వెల్త్ క్రీడలు (2022), 2024 ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్‌లో పూర్తిస్థాయి మహిళా అంపైరింగ్ ప్యానెల్‌తో టోర్నీలను నిర్వహించినా వన్డే ప్రపంచకప్‌లో ఇలా చేయనుండటం ఇదే మొదటిసారి కావడం విశేషం.






# 'కొత్త లోక' ఎఫెక్ట్.

## 'కాంత' సినిమాను వాయిదా వేసిన దుల్కర్

మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ నిర్మాణంలో వచ్చిన లోక సినిమా ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా ప్రస్తుతం మంచి కలెక్షన్లు రాబడుతుండటంతో తన కాంత సినిమా విడుదలను వాయిదా వేశాడు దుల్కర్. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా ప్రకటించాడు.ప్రియమైన ప్రేక్షకులకు.. 'కాంత' టీజర్ విడుదలైనప్పటి నుంచి మీరు చూపిస్తున్న ప్రేమ, ఆదరణ, మద్దతు మా హృదయాలను హత్తుకున్నాయి. మీ అభిమానం మాకు ఎంతో విలువైనది. మా సినిమా ద్వారా మీకు మరింత మెరుగైన అనుభూతిని అందించాలని మేము కోరుకుంటున్నాం. 'కొత్త లోక' ఘన విజయం సాధించి, బాక్సాఫీస్ వద్ద చంద్ర విజయయాత్ర కొనసాగించాలని మేము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. అదే ఉత్సాహంతో, మిమ్మల్ని మరో అద్భుతమైన సినీ ప్రపంచంలోకి తీసుకెళ్లడానికి మేము సిద్ధమవుతున్నాం. ఈ నేపథ్యంలో మా చిత్రం 'కాంత' విడుదల తేదీని వాయిదా వేస్తున్నామని మీకు తెలియజేస్తున్నాం. త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాము. అప్పటివరకు మీ మద్దతు ఇలాగే కొనసాగుతుందని ఆశిస్తున్నాం. త్వరలోనే మీ అందరినీ థియేటర్లలో కలుసుకోవాలని ఆశగా ఎదురుచూస్తున్నాం. అంటూ కాంత టీమ్ రాసుకొచ్చింది. నిజానికి ఈ సినిమా సెప్టెంబర్ 12, 2025న విడుదల కావాల్సి ఉంది. అయితే, ఈ సినిమా ఇప్పుడు దీపావళికి వాయిదా పడుతుందని పుకార్లు వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ సినిమాకు సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే, సముద్రకని కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# సిద్దు జొన్నల గడ్డ 'తెలుసు కదా' టీజర్ రిలీజ్

యువ హీరో సిద్దు జొన్నల గడ్డ. ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తెలుసు కదా . ఈ సినిమాకు పాపులర్ స్క్రీన్ రైటర్ కోన వెంకట్ సోదరి నీరజ కోన దర్శకత్వం వహిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అక్టోబర్ 17న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను వదిలారు మేకర్స్. ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి, టాలీవుడ్ బ్యూటీ రాశి ఖన్నా కథానాయికలుగా నటించబోతున్నారు. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి యువరాజ్ సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నాడు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు.

# ఐశ్వర్య ఫొటోలు వాడితే కఠిన చర్యలు..

## ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు



తన అనుమతి లేకుండా తన ఫోటోలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సృష్టించబడుతున్న అశ్లీల చిత్రాలను అడ్డుకోవాలని కోరుతూ బాలీవుడ్ స్టార్ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పిటిషన్‌ను విచారించిన ఢిల్లీ హైకోర్టు నేడు కీలక తీర్పును ఇచ్చింది. ఇకనుంచి అనుమతి లేకుండా ఐశ్వర్య ఫొటోలు, వీడియోలు వాడడానికి వీల్లేదని న్యాయస్థానం తీర్పును ఇచ్చింది. అంతేగాకుండా ఆమె ఫొటోలను అనుమతి లేకుండా వాడడం వలన ఐశ్వర్యకి ఆర్థిక నష్టం కలిగించడమే కాకుండా ఆమె గౌరవం, ప్రతిష్ఠ ను దెబ్బతీసినట్లేనని కోర్టు పేర్కొంది.అలాగే ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లు, గూగుల్‌తో పాటు ఇతర ప్లాట్‌ఫార్మ్‌లలో ఐశ్వర్య ప్రస్తావించిన యూఆర్‌ఎల్‌లను తొలగించి, బ్లాక్ చేయాలని ప్రభుత్వానికి ఆదేశించింది. నోటీసులు అందిన 72 గంటల్లోపు ఆ యూఆర్‌ఎల్‌లను బ్లాక్ చేయాలని కోర్టు స్పష్టం చేసింది. అంతేకాక, ఈ యూఆర్‌ఎల్‌లను ఏడు రోజుల్లో బ్లాక్ చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఐటీ, సమాచార శాఖకు కూడా కోర్టు సూచించింది. మరోవైపు ఈ కేసులో తదుపరి విచారణ జనవరి 15న జరగనుంది.




# నువ్వు యాక్షన్ హీరో అవుతావ్

## కార్తికేయన్‌కు తలైవా ప్రశంసలు

శివకార్తికేయన్‌పై అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ప్రశంసలు కురిపించారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ నటించిన 'మదరాసి' ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి ఆదరణ సొంతం చేసుకుంటోంది. తాజాగా ఈ సినిమా చూసిన రజనీ చిత్రబృందాన్ని అభినందించారు. ఈ విషయాన్ని తెలుపుతూ శివకార్తికేయన్ పోస్ట్ పెట్టారు. తాను దైవంగా భావించే తలైవా నుంచి ప్రశంసలు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సినిమా బాగుంది. నీ నటన మరో స్థాయిలో ఉంది. అద్భుతంగా నటించావు. మదరాసి నాకు చాలా నచ్చింది. నువ్వు యాక్షన్ హీరో అయిపోతావు. నా దీవెనలు నీకు ఎప్పుడూ ఉంటాయి' అంటూ తన ట్రేడ్‌మార్క్ చిరునవ్వుతో రజనీకాంత్ నన్ను ప్రశంసించారు. నా దైవం నుంచి అభినందనలు అందుకోవడం ఆనందంగా ఉందని శివకార్తికేయన్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇక ఈ సినిమా విడుదలైన అనంతరం కోలీవుడ్ సినీ ప్రముఖులు దీన్ని ప్రశంసిస్తూ ఎక్స్ వేదికగా చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. దర్శకుడు శంకర్, లింగుస్వామి 'మదరాసి'పై రివ్యూ ఇచ్చారు. మదరాసి కథేంటంటే...తమిళనాడులో తుపాకీ సంస్కృతిని అలవాటు- చేసి సొమ్ము చేసుకోవాలనేది ఒక సిండికేట్ పన్నాగం. విరాట్ (విద్యుత్ జమ్వాల్), చిరాగ్ (షబీర్ కల్లరక్కల్) అనే ఇద్దరు స్నేహితుల్ని రంగంలోకి దించి ట్రక్కులకొద్దీ ఆయుధాల్ని తరలిస్తుంది. అవన్నీ ఓ ఫ్యాక్టరీకి చేరుతుండగా ఎన్.ఐ.ఎ.కి తెలుస్తుంది. ప్రేమ్‌నాథ్ (బిజు మేనన్) నేతృత్వంలోని ఎన్.ఐ.ఎ. ఆపాలని ప్రయత్నించినా అది సాధ్యం కాదు. దాంతో ఆయుధాలు నిల్వ ఉంచిన ఫ్యాక్టరీ మొత్తాన్ని పేల్చివేయాలనే ఒక ఆపరేషన్‌కి నడుం బిగిస్తుంది ఎన్.ఐ.ఎ. అయితే ఈ ఆపరేషన్ అంత సులభమైనదేమీ కాదు. ఒకరి ప్రాణాల్ని పణంగా పెట్టాల్సిందే. సరిగ్గా అదే సమయంలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న రఘురామ్ (శివకార్తికేయన్)ను ప్రేమ్‌నాథ్ కలుస్తాడు. ప్రాణాల్ని ఏమాత్రం లెక్కచేయని రఘురామ్‌ని ఈ ఆపరేషన్‌లోకి తీసుకురావాలని నిర్ణయిస్తాడు. మరి ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తయిందా? అసలు రఘురామ్ ఎవరు? అతనికి ప్రాణాలంటే లెక్కలేనితనం ఎందుకు? మాలతి (రుక్మిణీ వసంత్)తో అతనికి ఉన్న సంబంధం ఏమిటి? తదితర విషయాల్ని తెరకెక్కించారు.

# అగ్ర కథానాయకుడి పాటకు కొరియోగ్రఫీ

## జీవిత కల నెరవేరిందన్న విజయ్




అగ్ర కథానాయకుడు చిరంజీవి పాటకు కొరియోగ్రఫీ చేయాలని ప్రతి డ్యాన్సర్‌కు ఉంటుంది. 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో తనకు ఆ కల నెరవేరిందని పొలాకి విజయ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న మూవీలో నయనతార కథానాయిక. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీకి సంబంధించిన ఓ పాటను చిత్రీకరించే పనిలో టీమ్ ఉంది. ఈ పాటకు కొరియోగ్రఫీ చేసే అవకాశం విజయ్‌కు రావడంతో ఎక్స్ వేదికగా భావోద్వేగ పోస్ట్‌ను పెట్టారు. చిన్నప్పటి కల..ఎవరి డ్యాన్స్ చూసి పెరిగానో.. ఎవరి స్టెప్స్ చూసి డ్యాన్స్ మీద ఇష్టం కలిగిందో.. ఎవరి డ్యాన్స్ చూసి నేను ఇండస్ట్రీక్రి వెళ్లాలి అని అనుకున్నానో.. ఎవరి డ్యాన్స్ చూసి నాకు ఆయనతో ఒక ఛాన్స్ వస్తుందా? అని ఫీలయ్యానో.. అలాంటి డ్యాన్స్‌కు దేవుడైన వన్ అండ్ ఓన్లీ మెగాస్టార్ చిరంజీవి గారికి నేను కొరియోగ్రఫీ చేసే అవకాశం రావడం నాకు దేవుడిచ్చిన పెద్ద గిఫ్ట్. 2025 నా జీవితంలో ఒక పెద్ద మలుపు. ఈ రోజు మా బాస్‌తో పనిచేసే అవకాశం రావడానికి కారణం అనిల్ రావిపూడి సర్, సుస్మితగారు, సాహు గారు. మీ సహకారానికి ధన్యవాదాలు. ఇది మర్చిపోలేని బహుమతి. మీకెప్పటికీ రుణపడి ఉంటాను. సమీర్ సర్ సహకారానికి కూడా ధన్యవాదాలు. ప్రతి ఒక్క డ్యాన్సర్ కల బాస్‌తో కలిసి పనిచేయడం. మా అమ్మానాన్నలకు కూడా ఆయనంటే అభిమానం. వారి ఆశీస్సులు ఉండటం వల్ల నేను ఈరోజు ఆయన వరకూ చేరుకున్నానని భావిస్తున్నా. చిరంజీవి సర్ మీ ప్రేమను ఎప్పటికీ మర్చిపోలేను. అని విజయ్ పేర్కొన్నారు. వచ్చే సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492